మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com


మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 6-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 38 Issue: 38

06 ఆగస్టు 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:00 సూర్యాస్తమయం - సా. 6:43 తిథి అష్టమి సా. 6:48 వరకు తరువాత నవమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం భరణి రా. 8:09 వరకు తరువాత కృతిక యోగం గండ మ. 2:54 వరకు కరణం బాలవ ఉ. 7:50 వరకు కౌలవ సా. 6:48 వరకు వర్జ్యం ఉ. 6:28 నుండి ఉ. 8:00 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:05 వరకు మ. 3:19 నుండి సా. 4:10 వరకు రాహుకాలం మ. 1:57 నుండి మ. 3:32 వరకు యమగండం ఉ. 6:00 నుండి ఉ. 7:35 వరకు గుళికాకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:24 నుండి తె. 5:12 వరకు అమృత ఘడియలు మ. 3:37 నుండి సా. 5:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: ౹౦౦ అనగా మరుసటి రోజున

Circulated to Telangana Published from Jagitial


## 100 కాదు.. డయల్ 112




### పోలీసులు, అంబులెన్స్, ఫైర్ సహా 18 ఎమర్జెన్సీ సేవలు

### కొత్త వ్యవస్థతో 2 నిమిషాల్లోపే స్పందన

**రాష్ట్రంలో అత్యవసర సేవల వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు పోలీసు సహాయం కోసం 100.. అగ్నిమాపక సేవల కోసం 101.. అంబులెన్స్ కోసం 108 వంటి వేర్వేరు నంబర్లకు కాల్ చేయాల్సి వచ్చేది. ఇక నుంచి అలాంటి అవసరం లేకుండా అన్ని రకాల అత్యవసర సేవలకు ఒకే నంబర్ 112ను అందుబాటులోకి వచ్చింది.**

హైదరాబాద్, ఆగస్టు 5 (ఈవార్తలు): తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) ఆధ్వర్యంలో రూపొందించిన నెక్స్ట్ జెన్ డయల్ 1 112 ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టంను డీజీపీ సీవీ ఆనంద్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక సేవలు మాత్రమే కాకుండా మహిళల భద్రత, చైల్డ్ హెల్ప్‌లైన్, విపత్తు నిర్వహణ, విద్యుత్, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎన్ఆర్ఐ సహాయ కేంద్రం వంటి మొత్తం 18 రకాల అత్యవసర సేవలు ఒకే నంబర్ ద్వారా అందుబాటులోకి రానున్నాయని తరువాయి 2 వ పేజీలో...



## సామాజిక 'సంకల్ప' సమరం

### నేడు సరూర్‌నగర్‌లో కవిత భారీ సభ.. 10 వేల మంది ప్రతినిధులతో ప్రతిజ్ఞ

హైదరాబాద్, ఆగస్టు 5 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ సభ ప్రారంభం కానుంది. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు పలువురు ప్రముఖులు సభకు హాజరుకానున్నారు. సభలో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చే సుమారు 10 వేల మంది ప్రతినిధులతో కలిసి సామాజిక న్యాయ తెలంగాణ సాధనకు కట్టుబడి తరువాయి 2 వ పేజీలో...

## 'బొమ్మ' తిరగేశాడు!



### హరీశ్ చేతబడి చేశాడని నేననలేదు.. 70,80ల్లో చేతబడుల ప్రచారం ఉండే

ఇప్పుడు సైన్స్ అభివృద్ధి చెందింది: టీపీసీసీ చీఫ్. తమిళనాడు పర్యటన సంగతేంటి మరి?.. మళ్లీ ప్రశ్నించిన మహేశ్ కుమార్ గౌడ్

**మాజీ మంత్రి హరీశ్ రావు చేతబడి చేశాడని తాను అనలేదని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ మాట తిరగేశారు. 70, 80 సంవత్సరాల క్రితం తెలంగాణలో చేతబడులని ప్రచారం ఉండేదని, ఇప్పుడు సైన్స్ బాగా అభివృద్ధి చెందిందంటూ వివరణ ఇచ్చారు. అయితే, తమిళనాడు పర్యటన సంగతేంటని మళ్లీ ప్రశ్నించారు.**

నిజామాబాద్, ఆగస్టు 5 (ఈవార్తలు): ఈ అంశంపై తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి తనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులకు లీగల్ నోటీసులు పంపించడం ద్వారా అసలు విషయాన్ని పక్కదారి పట్టించే తరువాయి 2 వ పేజీలో...

## దొంగ కాలేజీలు

### హైడ్రా రంగనాథ్ సంతకం ఫోర్జరీ.. ఫైర్ డీజీ నాగిరెడ్డి సంతకాలు కూడా

### నకిలీ ఫైర్ ఎన్వోసీలు సృష్టి.. 8 కాలేజీలపై కేసు నమోదు



**హైదరాబాద్‌లో నకిలీ పత్రాల వ్యవహారం కలకలం రేపుతోంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ ఎన్వోసీలు సృష్టించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 8 ప్రైవేట్ కాలేజీలపై కేసు నమోదైంది. ఈ నకిలీ ఎన్వోసీలను ఇంటర్ బోర్డుకు సమర్పించి గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. హైడ్రా పేరుతో తయారు చేసిన నకిలీ పత్రాల వ్యవహారం వెలుగులోకి రావడంతో, సంబంధిత కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై హైదరాబాద్‌లోని లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.**

హైదరాబాద్, ఆగస్టు 5 (ఈవార్తలు): నకిలీ పత్రాల తయారీ, ఫోర్జరీ, మోసం తదితర అభియోగాల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు నమోదు చేసిన కేసులో భారత న్యాయ సంహిత సెక్షన్లు 337, 336(3), 340(2), 318 (4), 3(5) కింద చర్యలు తీసుకుంటున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పుర ప్రాంతాల్లో ఉన్న కొన్ని కాలేజీల యాజమాన్యాలు ఈ ఫోర్జరీ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇదే తరహాలో మరిన్ని అక్రమాలు జరిగాయా? అన్న కోణంలో అధికారులు విచారణను ముమ్మరం చేశారు. మరో 60 కాలేజీలకు సంబంధించిన ఎన్వోసీలను కూడా స్క్రూటినీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు.. హైడ్రా పేరును ఉపయోగించి, ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేయడం తీవ్ర నేరమని అధికారులు చెబుతున్నారు. నాగిరెడ్డి గతంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేయగా.. ఆ తర్వాత ఆయన బదిలీ అయ్యి, ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ డీజీ స్థానంలో నాగిరెడ్డి లేకపోయినా.. ఆయన పేరు, సంతకాలతో ఉన్న తరువాయి 2 వ పేజీలో...



## తప్పైంది.. ఇండియా!

### మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు

**మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారు. తన ప్లాట్‌ఫాంలపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ (సీఎస్ఏఎం), డీప్‌ఫేక్ కంటెంట్, నిర్వహణ లోపాలు అన్నింటికీ కలిపి జుకర్‌బర్గ్ బుధవారం కేంద్రానికి క్షమాపణలు చెప్పినట్లు సమాచారం.**

న్యూఢిల్లీ: మెటా ప్లాట్‌ఫాంలలో లోపాలపై ఆ సంస్థకు కేంద్రం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో సోషల్ మీడియాలో ప్రధాని వీడియో తొలగింపుపై కూడా కేంద్రం మెటాపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మూడు రోజుల్లోగా మెటా సీఈవో జుకర్‌బర్గ్ క్షమాపణలు -2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,575 |
| వెండి (కిలో): | రూ.2,40,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,363 |

### విశ్వవాణి



కళ్ల అలసట తగ్గించుకోవాలని ఓ యువకుడు పలుమార్లు పర్కషివ్ మసాజ్ గన్‌ను కళ్లపై, కళ్ల చుట్టూ ఉపయోగించడంతో తీవ్ర కంటి గాయాలు ఏర్పడిన అరుదైన ఘటనను వైద్యులు వెల్లడించారు. సకాలంలో చికిత్స అందడంతో అతని చూపు కాపాడగలిగినప్పటికీ, ఇటువంటి పరికరాలను కళ్లపై లేదా కళ్ల సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణకు రేవంత్ మోసం

### ఏపీకి మన నీళ్లు ధారాదత్తం చేసే ప్లాన్

### సమ్మక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో కుమ్మక్కు

### మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపణలు



**కర్ణాటకలో జరిగిన ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ అనంతరం సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు చెందిన తెలంగాణ వాటా నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధపడిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.**

హైదరాబాద్, ఆగస్టు 5 (ఈవార్తలు): తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... తెలంగాణ ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన నీటి హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంల సమావేశం, తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం తర్వాత సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి మన రాష్ట్రానికి చెందిన 47 టీఎంసీల వాటాను ఏపీ కోసం వదులుకోవడానికి సిద్ధపడ్డారనే వార్తలు నెట్టింట వ్యాపిస్తున్నాయని... తరువాయి 2 వ పేజీలో...



## తుమ్మిడిహెట్టికి కావాలి సాయం

### ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించండి.. కేంద్ర జల్‌శక్తి మంత్రికి సీఎం రేవంత్ వినతి

న్యూఢిల్లీ: ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి భేటి అయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి తరువాయి 2 వ పేజీలో...

## సీజేపీ.. నో పాలిటిక్స్

### స్పష్టం చేసిన అభిజీత్ దీప్కే



**నీట్ పేపర్ లీక్‌పై దేశవ్యాప్త ఉద్యమానికి నాయకత్వం వహించిన కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) రాజకీయ ఆరంగేట్రంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తాజాగా క్లారిటీ ఇచ్చారు. పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారే ఉద్దేశం తమకు లేదని బుధవారం స్పష్టం చేశారు. నేరుగా ఎన్నికల బరిలోకి దిగేకంటే ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే ప్రెషర్ గ్రూప్‌గా కొనసాగుతామని పేర్కొన్నారు.**

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో తన మద్దతుదారులను ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతానికి సీజేపీ ప్రెషర్ గ్రూప్‌గా కొనసాగుతుంది. భారత్‌కు ఇలాంటి వాటి అవసరం ఉంది' అని అన్నారు. అంతకు ముందు, సీజేపీ టాప్ నాయకత్వం ఛత్రపతి శంభాజీ నగర్‌లో సమా వేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించింది. ఈ నేపథ్యంలో సీజేపీ రాజకీయ ఆరంగేట్రం చేయొచ్చన్న అంచనాలు వచ్చాయి. వీటిని ఖండిస్తూ దీప్కే తాజాగా వివరణ ఇచ్చారు. దేశవ్యాప్తంగా తమ జెన్ జీ మద్దతుదారుల సలహాలు తీసుకున్నాకే తమ దీర్ఘకాలిక ప్రణాళికపై చర్యలు తీసుకుంటామని దీప్కే గతంలో పలు సందర్భాల్లో చెప్పారు. మొదట ఆన్‌లైన్ ఉద్యమంగా ప్రారంభమైన సీజేపీ ఆ తరువాత పేపర్ లీక్‌పై న్యూఢిల్లీలో క్షేత్రస్థాయిలో నిరసనకు దిగిన విషయం తెలిసిందే.




## నీట్.. సీబీటీ!

### ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తాం

### సుప్రీంలో కేంద్రం అఫిడవిట్

### నేడు పిటిషన్లపై విచారణ

న్యూఢిల్లీ: నీట్-యూజీ పరీక్ష నిర్వహణను కఠినతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం పరీక్ష నిర్వహణా విధానంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఈ విషయాన్ని కేంద్రం తాజాగా సుప్రీంకోర్టుకు తెలిపింది. పరీక్ష తరువాయి 2 వ పేజీలో...



## దుబాయ్‌లో బాంబుల మోత

### 20 నిమిషాల్లో 7 పేలుళ్లు

### జెబెల్ అలీ ప్రాంతంలో వరుస పేలుళ్లు

### హౌతీల దాడి అయ్యుండొచ్చన్న ప్రచారం

**దుబాయ్ జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం ఉదయం వరుస పేలుళ్లు సంభవించాయి. 20 నిమిషాల వ్యవధిలో ఏడు పేలుళ్లు చోటుచేసుకున్నట్టు ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలముకున్నాయి. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. జెబెల్ అలీ నౌకాశ్రయం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో ఈ పేలుళ్లు జరిగినట్టు సమాచారం.**

## రాశి ఫలాలు

6.8.2026

మేషం: చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నపటికీ సకాలంలో పూర్తిచేస్తారు. సంతానం కొన్ని విషయాలలో మీతో విభేదిస్తారు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు తప్పవు. పాత ఋణముల ఒత్తిడి పెరుగుతుంది.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది.

మిధునం: ఆర్ధిక ఇబ్బందులు నుంచి కొంత వరకు బయటపడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాల వలన ఆర్ధిక లాభాలు పొందుతారు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. కుటుంబ సభ్యులు నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగమున సానుకూల వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: కొన్ని విషయాలలో అందరితో సమస్యలు కలుగుతాయి. దూర ప్రాంతాల నుంచి అందిన వార్త కొంత ఊరట కలిగిస్తుంది. ఆదాయం ఆశించిన విధంగా ఉండదు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులుంటాయి. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

సింహం: బంధు మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. వ్యాపారమున స్నేహితుల నుంచి పెట్టుబడులు అందుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశములు అందుతాయి.

కన్య: చుట్టుపక్కల వారితో ఊహించని విభేదాలు కలుగుతాయి. ధన వ్యవహారాలలో లోటుపాట్లు తప్పవు. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది.

తుల: ఆర్ధిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు ధన సహాయం లభిస్తుంది. కీలక వ్యవహారాలలో మిత్రుల సలహాలు తీసుకోవడం మంచిది. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. నిరుద్యోగులకు ఉన్నత అవకాశములు లభిస్తాయి.

వృశ్చికం: దూర ప్రాంతాల ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆర్ధిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి గృహమున సంతోషంగా గడుపుతారు. ఉద్యోగమున ఉన్నతాధికారుల అనుగ్రహం కలుగుతుంది.

ధనస్సు: దైవ అనుగ్రహంతో ముఖ్యమైన పనులు పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలలో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో నూతన ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి.

మకరం: కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరం అవుతాయి. కుటుంబ వాతావరణం మరింత చికాకు పరుస్తుంది. ఉద్యోగస్తులు అధికారులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు.

కుంభం: ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్ధిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలలో సమర్ధవంతంగా నిర్వహించి లాభాలు పొందుతారు.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారములు అందుతాయి. ఇంటా బయట శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు విజయవంతంగా ప్రారంభిస్తారు. నిరుద్యోగులకు అప్రయత్నంగా నూతన అవకాశాలు అందుతాయి. ఆర్ధిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ప్రయాణాలలో మరింత జాగ్రత్త వహించాలి.

# ‘బొమ్మ’ తిరగేశాడు!

**మొదటి పేజీ తరువాయి**

ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. నోటీసులు పంపడం కంటే ప్రజల సందేహాలకు సమాధానం చెప్పడం ముఖ్యమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపైనా తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత ఏమిటో ఇప్పటికే ప్రజలకు తెలిసిపోయిందని, నీటి ఒత్తిడికి బ్యారేజీలే దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భారీ లోపాలు జరిగాయని, లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం గోదావరిలో కలిసిపోయిందని ఆరోపించారు. సీఎంఆర్ వ్యవహారంపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్, తప్పు చేసిన వారిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులకు కూడా ఇదే విషయాన్ని తాను స్పష్టంగా చెప్పినట్లు వెల్లడించారు. అలాగే కేటీఆర్ చేపట్టే పాదయాత్ర వల్ల ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి 80 శాతం స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# తుమ్మిడిహెట్టికి కావాలి సాయం

**మొదటి పేజీ తరువాయి**

ప్రాజెక్టు ప్రాధాన్యం, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్ శక్తికి పంపిన లేఖ విషయాన్ని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి వివరించారు. సీడబ్ల్యూ పీ ఆర్ఎస్ అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందన్నారు. కాబట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను సీఎం కోరారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి రేవంత్ తెలియజేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదని, ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రిని కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని సీఎం వివరించారు. మరోవైపు సీఎం రేవంత్ విజ్ఞప్తిపై జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

### రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్

సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు హైదరాబాద్ ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది. సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, అధికారిక పర్యటన నిమిత్తం తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వాలని, విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం, పలు షరతులతో ఆయన విదేశీ పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆగస్టు 3న జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించవచ్చు. అయితే, ఈ పర్యటనకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. రూ.1 లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీని సమర్పించాలని ఆదేశించింది. పర్యటన ప్రణాళిక, ఆయా దేశాల్లో బస చేసే వివరాలను కోర్టుకు అందించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు కేంద్ర విదేశాంగ శాఖ నుంచి రాజకీయపరమైన అనుమతి పొందాలని, పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక 2026 సెప్టెంబర్ 18 లోగా తన పాస్‌పోర్ట్‌ను తిరిగి కోర్టులో జమ చేయాలని ఆదేశాల్లో పేర్కొంది.

# నీట్.. సీబీటీ!

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహణ విషయంలో లోపాల్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పలు పిటిషన్లపై గురువారం విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. పరీక్ష నిర్వహించబోయే విధానంపై కేంద్రానికి వివరించింది. దీని ప్రకారం.. ఇకపై నీట్-యూజీ పరీక్షను ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు. పెన్, పేపర్ బదులు.. సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో, అలాగే, జేఈఈ పరీక్షలాగా, రెండు దశల్లో పరీక్ష జరుగుతుంది. ఇప్పటికే ఎన్‌టీయే (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆన్‌లైన్ విధానంలో ఎనిమిది ప్రధాన పరీక్షల్ని నిర్వహిస్తోందని కేంద్రం తెలిపింది. అందువల్ల నీట్ పరీక్షను కూడా ఇలా నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పింది. జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్ తరహాలో రెండు దశల్లో ఈ పరీక్ష నిర్వహించడం వల్ల అభ్యర్థుల సామర్థ్యాన్ని మరింతగా పరీక్షించే వీలుంటుందని, అవకతవకలకు అడ్డుకట్ట వేసి, మరింత భద్రంగా పరీక్ష నిర్వహించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. అయితే, దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఇదే సమయంలో పరీక్ష నిర్వహణపై సంస్కరణల గురించి ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు కూడా కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇన్ఫోసిస్ కో ఫౌండర్ నందన్ నీలేకని ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

# సామాజిక ‘సంకల్ప’ సమరం

**మొదటి పేజీ తరువాయి**

ఉంటామని కల్వకుంట్ల కవిత ప్రతిజ్ఞ చేయనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సాధికారత కోసం పార్టీ అనుసరించనున్న కార్యాచరణను ఆమె ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేవలం రాజకీయ నినాదంగా కాకుండా సామాజిక న్యాయం ఆచరణలోకి రావాలనే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన పనిచేస్తోందని పేర్కొన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు సహా అట్టడుగు వర్గాలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పార్టీ నాయకత్వం వెల్లడించింది. సంకల్ప సభా ప్రాంగణాన్ని సామాజిక సంస్కరణలకు కృషి చేసిన మహనీయుల చిత్రపటాలతో అలంకరిస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, భాగ్యరెడ్డి వర్మ, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కొమురం భీమ్, లక్ష్మణ్ బాపూజీ, కాన్షీరాం, కర్పూరి ఠాకూర్ తదితర సామాజిక వైతాళికుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు.

# తెలంగాణకు రేవంత్ మోసం

**మొదటి పేజీ తరువాయి**

దీనిపై సీఎం రేవంత్ రెడ్డి నోరు విప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు అజెండాలో సమ్మక్క సాగర్‌కు 47 టీఎంసీలు కేటాయించే ప్రసక్తే లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసినా, ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. తమ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సమ్మక్క సాగర్ 47 టీఎంసీల ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కేంద్ర అనుమతులు తీసుకొచ్చామని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆఖరికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గానికి కూడా ఫలాలను అందించే ఈ నీటి కేటాయింపులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వదులుకుంటుందని ప్రశ్నించారు. చంద్రబాబు మళ్లీ తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు కుట్రలు పన్నుతున్నారని, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకునేలా కేంద్రానికి లేఖలు రాయడమే కాకుండా బోర్డు సమావేశాల్లో పాత అనుమతులను రద్దు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణకు నీటి విషయంలో అన్యాయం జరిగితే సహించేది లేదని, జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబును ఈ సందర్భంగా హెచ్చరించారు.

# 100 కాదు.. డయల్ 112

**మొదటి పేజీ తరువాయి**

డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. దీంతో ప్రజలు వేర్వేరు హెల్ప్‌లైన్ నంబర్లు గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇక ఈ 112 సర్వీసుల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ప్రజల దగ్గరి నుంచి 112కు కాల్ వచ్చిన వెంటనే ఆ వ్యక్తి ఉన్న ప్రాంతాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించే అడ్వాన్స్‌డ్ లొకేషన్ టెక్నాలజీ ఈ వ్యవస్థలో ఉంది. దీంతో అత్యంత సమీపంలో ఉన్న పోలీస్, అంబులెన్స్ లేదా ఫైర్ సిబ్బందికి సమాచారం చేర్చుతారు. తక్షణమే వారిని సంఘటనా స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకుంటారు. గతంలో ఈ రెస్పాన్స్ తీసుకోవడానికి 3, 4 నిమిషాలు పట్టగా, ఈ సరికొత్త వ్యవస్థతో సుమారు 2 నిమిషాల్లోనే స్పందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ 112 సర్వీసులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాల్ మేనేజ్‌మెంట్‌ను కూడా ప్రవేశపెట్టారు. కాల్ అందిన వెంటనే ఆపరేటర్లు లైవ్‌లో స్పందించి అవసరమైన విభాగానికి సమాచారాన్ని పంపిస్తారు. భవిష్యత్తులో డ్రోన్ ఆధారిత టెక్నాలజీ సర్వీసులను కూడా 112 వ్యవస్థతో అనుసంధానం చేయాలని తెలంగాణ పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దేశంలో ఒకే ఎమర్జెన్సీ నంబర్ ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు తెలంగాణలో ఈ వ్యవస్థను మరింత ఆధునికంగా రూపొందించామని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు.



# దొంగ కాలేజీలు

**మొదటి పేజీ తరువాయి**

ఎన్వోసీలను సమర్పించడంతో అధికారులకు అనుమానం వచ్చింది. ఈ అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు అధికారులు వాటి పత్రాలను పరిశీలించగా మొత్తం 8 కళాశాలలు నకిలీ ఎన్వోసీలు సృష్టించినట్లు బయటపడింది. ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని హైడ్రా అధికారులు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డుకు సిఫార్సు చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం మరో 60కు పైగా కాలేజీలు సమర్పించిన ఎన్వోసీలను కూడా అధికారులు క్షుణ్నంగా పరిశీలన చేస్తున్నారు. అవసరమైతే ఈ ఫోర్జరీ వ్యవహారంలో మరిన్ని కేసులు నమోదు చేసే అవకాశముందని తెలుస్తోంది. దీంతో నకిలీ ఎన్వోసీలు ఉన్న కాలేజీల యాజమాన్యాలు భయపడుతున్నాయి.

### ఆ 8 కాలేజీలు ఇవే..

- ప్రియాంకా జూనియర్ కాలేజ్-మెహిదీపట్నం
- మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్-విద్యానగర్
- శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్-చాంద్రాయణగుట్ట
- న్యూఎరా జూనియర్ కాలేజ్-చిక్కడపల్లి
- షాహిర్ జూనియర్ కాలేజ్-శివరాంపల్లి
- వశిష్ట జూనియర్ కాలేజ్-తెల్లాపూర్
- హైందవి జూనియర్ కాలేజ్-బర్కత్‌పుర
- రెసిడెన్స్ జూనియర్ కాలేజ్-ఎస్ఆర్‌నగర్

# తప్పైంది.. ఇండియా!

**మొదటి పేజీ తరువాయి**

చెప్పాలని కేంద్రం డిమాండ్ చేసింది. జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పాలని, లేకుంటే చట్టబద్ధమైన రక్షణ కల్పించే క్లాజ్ (సేఫ్ హార్బర్ (ప్రొటెక్షన్) కోల్పోతారని పార్లమెంట్ స్థాయీ సంఘం సూచించింది. దీనిపై చర్చించేందుకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో బుధవారం మెటా ప్రతినిధులు భేటీ అయ్యారు. ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు. మెటా తరఫున సంస్థ చీఫ్ గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ జోయెల్ కాప్లన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రధాని వీడియో తొలగింపుపై మెటా ప్రతినిధులు వివరణ ఇచ్చారు. అభ్యంతరకర కంటెంట్‌ను ఎలా అనుమతించారంటూ కేంద్రం ప్రశ్నించింది. దీనిపై వివరణ కోరింది. 45 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పినట్లు సమాచారం. సంస్థ తరఫున జరిగిన పొరపాట్లను ఆయన అంగీకరించారు. నిర్వహణా లోపాలపై విచారం వ్యక్తం చేసిన జుకర్‌బర్గ్.. మోదీతోపాటు, అన్నింటికీ క్షమాపణలు కోరారు.

# దుబాయ్‌లో బాంబుల మోత

### 20 నిమిషాల్లో 7 పేలుళ్లు

### జెబెల్ అలీ ప్రాంతంలో వరుస పేలుళ్లు

### హౌతీల దాడి అయ్యుండొచ్చన్న ప్రచారం

అబుదాబి: దుబాయ్ జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం ఉదయం వరుస పేలుళ్లు సంభవించాయి. 20 నిమిషాల వ్యవధిలో ఏడు పేలుళ్లు చోటుచేసు కున్నట్టు ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ ఘటనతో ఆ ప్రాంత మంతా దట్టమైన పొగలు అలముకున్నాయి. ఘటన కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడి యాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. జెబెల్ అలీ నౌకాశ్రయం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో ఈ పేలుళ్లు జరిగినట్టు సమాచారం. ఇంధన నిల్వలు, సరకు రవాణాకు ఇది కీలక కేంద్రంగా గుర్తింపు పొందింది. అయితే పేలుళ్లకు కారణం ఏమిటన్న విషయంపై యూఏఈ అధికారులు ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ప్రాణనష్టం, ఆస్తి నష్టంపై కూడా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. పేలుళ్ల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో ఘటనను చిత్రీకరిస్తున్న ఇద్దరిని యూఏఈ అధికారులు అదుపులోకి తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఈ పేలుళ్లు యెమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణుల వల్లే జరిగాయని మెహర్ వార్తా సంస్థ పేర్కొంది. మరోవైపు, పలుసార్లు పేలుళ్ల శబ్దాలు వినిపించిన విషయాన్ని యూఏఈ మీడియా ధ్రువీకరించినా, వాటికి కారణంపై ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు. నాసా థర్మల్ ఇమేజరీలో జెబెల్ అలీ పోర్టు సమీపంలోని ఓ గిడ్డంగిలో భారీ అగ్నిప్రమాదం నమోదైనట్టు స్థానిక మీడియా తెలిపింది. ఆ ప్రాంతంలో ఇంధన నిల్వలు ఉండటంతో పేలుళ్ల తర్వాత మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు. అదే సమయంలో యెమెన్ రాజధాని సనాలో కూడా పేలుళ్ల శబ్దాలు వినిపించినట్టు సమాచారం. అవి వైమానిక దాడుల ఫలితమా, లేక అక్కడి నుంచి క్షిపణులు ప్రయోగించారా అన్న అంశంపై స్పష్టత లేదు.



జెబెల్ అలీపై యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు దాడి చేసి ఉండొచ్చని కొన్ని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ ఘటనకు తామే కారణమని హౌతీలు ప్రకటించలేదు. యూఏఈ ప్రభుత్వం కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ధారణ చేయలేదు. ఇరాన్‌కు సంబంధించిన ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఘటనకు అసలు కారణంపై యూఏఈ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## ఈ-20 పెట్రోల్‌తో దేశానికి ప్రయోజనం

**కేజ్రీవాల్ ప్రచారాన్ని వ్యతిరేకించిన ఏసీఎస్ రాజు**

జగిత్యాల, ఆగస్టు 5 (ఈవార్తలు): ఇథనాల్ కలిపిన ఈ-20 పెట్రోల్ విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ చేపట్టిన ప్రచారాన్ని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఏసీఎస్ రాజు, సామాజిక సమరసత వేదిక కరీంనగర్ విభాగ్ సంయోజక్ చిట్ల గంగాధర్ మాట్లాడుతూ ఈ-20 పెట్రోల్‌తో దేశ రైతులకు ప్రయోజనం లేదంటూ చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. ఈ-20 వినియోగంతో పెట్రోల్ దిగుమతులు తగ్గి వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని, పర్యావరణ పరిరక్షణకు మేలు జరుగుతుందని తెలిపారు. చెరకు, మొక్కజొన్న రైతులకు కూడా ఇథనాల్ ఉత్పత్తి ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు. 2023 నుంచి తయారవుతున్న వాహనాలు ఈ-20 పెట్రోల్‌కు అనుకూలంగా వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న పథకాలు దేశ భవిష్యత్తుకు ప్రయోజనకరమైనవని, ప్రతిపక్షాలు దేశ ప్రయోజనాలను విస్మరించి మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ ఆరవ లక్ష్మి, వేముల పోచమల్లు, వేముల దేవరాజం, కొత్తకొండ బాలన్న, నరేందుల శ్రీనివాస్, గాదాసు భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి పలారం బండి ఊరేగింపు

జగిత్యాల, ఆగస్టు 5 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడ 38వ వార్డులో శ్రీ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ ముత్యాల పోచమ్మ తల్లి పలారం బండి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాలు, పోచమ్మ జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు, సేవా సమితి సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

**రూ.10 వేల జరిమానా.. కోర్టు తీర్పు**

జగిత్యాల/మల్లాపూర్, ఆగస్టు 5 (ఈవార్తలు): గంజాయి సరఫరా, విక్రయానికి పాల్పడిన నిందితుడు రావులకరి నితిన్ (21)కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల 1వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జి. సునీత రవీంద్రరెడ్డి తీర్పు వెలువరించారు. 2024 మార్చి 23న మల్లాపూర్ మండలం గొర్రెపల్లి గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై వచ్చిన నితిన్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా సుమారు 4 కిలోల గంజాయి లభించింది. గంజాయితో పాటు బైక్, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. విచారణలో రాయికల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి మల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అప్పటి ఎస్ఐ కిరణ్‌కుమార్, సీఐ నవీన్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షుల వాంగ్మూలాలు, శాస్త్రీయ ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్ష విధించింది. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. గంజాయి పెంపకం, రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడితే ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.





## సాయి రూప ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం

వేములవాడ అర్బన్, ఆగస్టు 5 (ఈవార్తలు): సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిరాశ్రయులు, అన్నార్తులు, వీధి యాచకులకు అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భోజనంతో పాటు వాటర్ బాటిళ్లు, అరటిపండ్లను పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేదలు, ఆకలితో అలమటించే వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రోజు నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమానికి కరీంనగర్‌కు చెందిన దగ్గు సాన్విక పుట్టినరోజు సందర్భంగా దాతగా సహకారం అందించారని పేర్కొన్నారు. సేవా కార్యక్రమానికి తోడ్పడిన దాతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి దూలం భూమేష్ గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎద్దండి రాజు, వాసాల హరిప్రసాద్, గొంటి నవీన్, పబ్బా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ సూచన**

కోరుట్ల, ఆగస్టు 5 (ఈవార్తలు): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, ఐపీఎస్ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో 'సైబర్ జాగ్రూకతా దివస్'లో భాగంగా బుధవారం కోరుట్లలోని పీబీ ఫంక్షన్ హాల్‌లో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడి మోసాలు, క్యూ ఆర్ కోడ్ స్కామ్‌లు, సోషల్ మీడియా మోసాలపై అవగాహన కల్పించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి, ఓఎఎవతీఓతీఱఎవ.స్త్రశీఙ.ఱఅలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం సైబర్ భద్రతపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. వారిని ఎస్పీ అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా 'సురక్షా కా తిరంగా-సైబర్ స్వతంత్ర తెలంగాణ' ప్రచార పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ రాములు, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బ్రిక్స్ సదస్సు విజయవంతం

హైదరాబాద్, ఆగస్టు 5 (పీఐబీ): హైదరాబాద్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృందం సమావేశం, ఆస్తుల పునరుద్ధరణపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆగస్టు 4, 5 తేదీల్లో ఈ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలు భారత్ ప్రతిపాదించిన "పటిష్టత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతల కోసం నిర్మాణం" అనే ఇతివృత్తానికి అనుగుణంగా సాగాయి. బ్రిక్స్ సభ్య దేశాల నుంచి ఉన్నతస్థాయి విధాన రూపకర్తలు, అవినీతి నిరోధక సంస్థలు, ఆర్థిక నిఘా విభాగాలు, చట్ట అమలు సంస్థల ప్రతినిధులు పాల్గొని అవినీతి నిరోధక చర్యలపై విస్తృతంగా చర్చించారు. సమావేశాలను ప్రారంభించిన కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ కార్యదర్శి రచనా షా మాట్లాడుతూ, అవినీతిని ఏమాత్రం సహించని భారత విధానాన్ని పునరుద్ఘాటించారు. సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, ప్రజల విశ్వాసానికి నైతికత, పారదర్శకత, జవాబుదారీతనం కీలకమని పేర్కొన్నారు. బలమైన సంస్థలు, సాంకేతికత ఆధారిత పరిపాలన, అంతర్జాతీయ సహకారంతోనే అవినీతిని సమర్థంగా ఎదుర్కోవచ్చని ఆమె తెలిపారు. బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృందం కేవలం చర్చల వేదికగా కాకుండా, ఆచరణాత్మక చర్యలకు దారితీసే వేదికగా రూపాంతరం చెందుతోందని రచనా షా పేర్కొన్నారు. సకాలంలో సమాచార మార్పిడి, సంబంధిత అధికార సంస్థల మధ్య సమన్వయం, పరస్పర చట్టపరమైన సహకారం, నిపుణుల మధ్య విశ్వసనీయ సమాచార వినిమయం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. అవినీతి కేసుల్లో దేశం దాటి పరారైన నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింత ప్రక్రియను వేగవంతం చేయడం కోసం బ్రిక్స్ చట్ట అమలు నిపుణుల ప్రత్యేక నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని భారత్ ప్రతిపాదించింది. ఈ




ప్రతిపాదనకు సభ్య దేశాలు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపాయి. లక్ష్యాలు, పరిధి, కార్యాచరణపై చర్చలు కొనసాగించాలని నిర్ణయించాయి. అలాగే, అవినీతి కేసుల్లో పరారైన నేరస్తుల వివరాలు, అనధికారిక సహకార విధానాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచే బ్రిక్స్ సమాచార నిధి (రిపాజిటరీ) ఏర్పాటును సభ్య దేశాలు స్వాగతించాయి. ఇది నేరస్తుల గుర్తింపు, అప్పగింత ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు దేశాల మధ్య సమాచార మార్పిడిని సమర్థవంతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశాలతో బ్రిక్స్ దేశాల మధ్య అవినీతి నిరోధక చర్యలు, ఆస్తుల పునరుద్ధరణ, పరారీలో ఉన్న నేరస్తుల అప్పగింత వంటి అంశాల్లో అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం కానుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయాలి

**బీజేపీ సిరిసిల్ల అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**



రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 5 (ఈవార్తలు): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ ఏడాది కూడా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, మోర్చాల అధ్యక్షులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ ఆసాని రామలింగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెడ్డబోయిన గోపి పాల్గొని కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావాన్ని మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా తీసుకుని ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసేలా కృషి చేయాలని సూచించారు. జిల్లాలో కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేక కార్యాచరణను ప్రకటించారు. ఆగస్టు 6, 7 తేదీల్లో మండల స్థాయి సమావేశాలు, 7 నుంచి 9 వరకు సామాజిక, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు, 9, 10 తేదీల్లో ప్రతి ఇంటికి జాతీయ పతాకాల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆగస్టు 10వ తేదీన ఉదయం రాష్ట్రవ్యాప్తంగా ఒకే సమయంలో బీజేపీ కార్యకర్తలు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని, అదే రోజు నుంచి సోషల్ మీడియా ఖాతాల్లో జాతీయ పతాకాన్ని ప్రొఫైల్ చిత్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను సరల్ యాప్, నమో యాప్‌తో పాటు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఆగస్టు 10 నుంచి 14 వరకు జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 25 ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించి రైతులు, యువత, మహిళలు, మాజీ సైనికులు తదితర వర్గాలను భాగస్వాములను చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం, మల్లారపు సంతోష్ రెడ్డి, బర్కం లక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి నవీన్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, మోర్చా నాయకులు, శక్తికేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం బీజేపీ జిల్లా ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ కన్వీనర్ పవన్ కుమార్ను జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి శాలువాతో సన్మానించి అభినందించారు. దేశ రక్షణలో మాజీ సైనికులు అందించిన సేవలు గర్వకారణమని, సమాజ సేవలోనూ వారి పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు.



## ఫీజు బకాయిల విడుదలకు బీజేవైఎం సంతకాల సేకరణ

వేములవాడ అర్బన్, ఆగస్టు 5 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజీరెడ్డి, రాష్ట్ర నాయకుడు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి జింక అనిల్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల పట్ల తన బాధ్యతను విస్మరించిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నిర్వీర్యమైందని, దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన "వన్‌టైమ్ సెటిల్‌మెంట్" హామీ అమలుకాకపోవడంతో విద్యార్థులు, కళాశాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్, ముత్యం, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కిసారి యశ్వంత్, సామోజి గౌతమ్, సల్ల జితేందర్, అనిల్‌తో పాటు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగిత్యాలలో విద్య, వైద్యానికి ప్రాధాన్యం

**నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండ: గాజంగి**

**రూ.41.35 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



జగిత్యాల, ఆగస్టు 5 (ఈవార్తలు): ప్రజా ప్రభుత్వంలో జగిత్యాలలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య అన్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 100 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.41.35 లక్షల విలువైన చెక్కులను బుధవారం మోతే రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవతో జగిత్యాలకు అత్యధిక సంఖ్యలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తోందన్నారు. జగిత్యాలలో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ వైద్య సదుపాయాల విస్తరణకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తూ జగిత్యాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, రూ.235 కోట్లతో నూతన ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, పీఏసీఎస్ చైర్మన్ సందీప్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్‌రెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొలిశెట్టి గంగారెడ్డి, గంగాధర్, సతీష్, మహేష్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## వరుసగా 1942వ రోజు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ అన్నదానం

వేములవాడ అర్బన్, ఆగస్టు 5 (ఈవార్తలు): మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో గత 1942 రోజులుగా నిరంతరంగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవారం వేములవాడలోని టీటీడీ ధర్మశాల, శ్రీ రాజరాజేశ్వర స్వామి, భీమేశ్వర ఆలయాల వద్ద పేదలు, అన్నార్తులకు ఉచిత భోజన వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేటి అన్నదాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత దంపతులు, ప్రతాప్-స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్-జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ-సాంబశివ దంపతులు, దేవరాజు ఉమ-బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు ప్రజ్ఞ-శరత్ చంద్ర, శిరీష-సాయిచంద్ర, శర్వాణి-రవిచంద్ర దంపతులు, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభ సందర్భాల్లో పేదలకు ఒక్కపూట అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్ట్ సభ్యులను లేదా 92469 39388 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సగ్గు రాహుల్, ముంజ వెంకటేష్, భీమన్న రాజు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులే దేశ భవిష్యత్తు

**కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్**

కోరుట్ల, ఆగస్టు 5 (ఈవార్తలు): కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలతో పాటు మోహన్‌రావుపేట, మదాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్య, పాఠశాలల్లోని మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన విధానంపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. మదాపూర్‌లో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తని, ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. పాఠశాలల్లో ఏ సమస్య ఉన్నా నిర్భయంగా ఉపాధ్యాయులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



## ఎల్ రమణకు జీవన్‌రెడ్డి పరామర్శ

జగిత్యాల, ఆగస్టు 5 (ఈవార్తలు): మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్సీ ఎల్. రమణ తల్లి ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆమెను పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్. రమణతో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా, జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతంపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఆయన ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరంపై చర్చించారు. రాబోయే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిపారు.

## జగిత్యాల జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీలు

జగిత్యాల, ఆగస్టు 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పోలీసు శాఖలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఎస్. సదాకర్‌ను ధర్మపురి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1గా నియమించారు. ధర్మపురి ఎస్ఐగా పనిచేస్తున్న మహేష్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. జి. శ్యాంరాజ్‌ను కోరుట్ల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



## టీఆర్ఎస్‌లోకి యువత క్యూ

**డాక్టర్ రఘు ఆధ్వర్యంలో భారీ చేరికలు**

మెట్‌పల్లి, ఆగస్టు 5 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేనలోకి యువత చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం మెట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు ఆధ్వర్యంలో పలువురు యువత తెలంగాణ రక్షణ సేనలో చేరారు. వారికి డాక్టర్ రఘు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చిన్నమెట్‌పల్లి యూత్ అధ్యక్షుడు చిలువేరి నితిన్, కోరుట్ల 16వ వార్డు యూత్ నేతలు కొండా బృహదేశ్వర్, మైస నరేందర్, శృంగారపు రాము, పసుల పవన్, బెజ్జరపు మణికంఠ తదితరులు చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అజార్ భాయ్, సుఖేందర్ గౌడ్, లింగపెల్లి సంజీవ్, రాజన్న, నాని, ప్రశాంత్ ముఖీమ్, తోట శ్రీనివాస్, గంగాధర్, వెంకటేష్, ప్రణీత్, నాగరాజు, నారాయణ, ప్రణయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ రేట్లు యథాతథం

**ప్రకటించిన ఆర్బీఐ గవర్నర్.. ముగిసిన ద్రవ్య పరపతి విధాన సమీక్ష**

**ఊపిరి పీల్చుకుంటున్న గృహ రుణ గ్రహీతలు**

న్యూఢిల్లీ: ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల్ని బుధవారం ప్రకటించింది. మరోసారి వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా 5.25 శాతం వద్ద ఉంచింది. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్త పరిస్థితులు, అధిక ద్రవ్యోల్బణం నేపథ్యంలో వాస్తవానికి ఈసారి వడ్డీ రేట్లను పెంచుతారన్న ఆందోళనలు నెలకొన్నాయి. కానీ అలా ఏం జరగలేదు. వడ్డీ రేట్లను పెంచితే ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై లోన్ తీసుకున్నవారు సహా కొత్తగా లోన్లు తీసుకునేవారిపై అధిక వడ్డీ భారం పడేది. వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచడం ముఖ్యంగా దీర్ఘకాలం కొనసాగించే హోం లోన్ గ్రహీతలకు భారీ ఉపశమనం కలిగించిందని చెప్పొచ్చు. గృహ రుణాల వడ్డీ రేట్లు సాధారణంగా ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లింక్డ్ రేటుకు లింక్ అయి ఉంటాయి. గతేడాది ఆర్బీఐ రెపో రేటు భారీగా తగ్గించిన నేపథ్యంలో ఇప్పుడు చాలా ప్రభుత్వ బ్యాంకుల్లో హోం లోన్ వడ్డీ రేట్లు చాలా తక్కువగానే ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర స్పెషల్ ఆఫర్ కింద కనీసం 7 శాతం వడ్డీకే హోం లోన్స్ ఇస్తుంది. ఇక్కడ గరిష్ఠంగా 9.90 శాతం వరకు పడుతుంది. రూ. 30- 75 లక్షల వరకు లోన్ ఆఫర్ చేస్తోంది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 7.10- 9.15 శాతంగా ఉండగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా 7.10-10 శాతంగా ఉంది. యూకో బ్యాంకులో 7.15-9.25 శాతంగా ఉంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 7.15-9.60 శాతం వరకు వడ్డీ రేట్లు ఉన్నాయి.



## విద్యార్థులు సహనంతో ఉండాలి..
## బలగాలు జాగ్రత్తగా ఉండాలి: సుప్రీం

న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే అన్ని సమస్యలకు అత్యంత శక్తివంతమైన పరిష్కారమని వ్యాఖ్యానించారు. అయితే శాంతిభద్రతలను కాపాడే క్రమంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచక్షణపై తమకు నమ్మకం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికలను పరిశీలించిన పిమ్మటే ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ధర్మాసనం తెలిపింది.



## తలకిందులుగా త్రివర్ణ పతాకం

**మెహబూబా ముఫ్తీపై విమర్శల వెల్లువ**

శ్రీనగర్: జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ జాతీయ జెండాను తలకిందులుగా పట్టుకున్న ఘటన రాజకీయంగా తీవ్ర వివాదానికి దారితీసింది. శ్రీనగర్‌లో ఆర్టికల్ 370, 35ఏ రద్దు వార్షిక దినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన నిరసనలో ఆమె చేతిలో త్రివర్ణ పతాకం తలకిందులుగా కనిపించింది. దీనిపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. నిరసన కార్యక్రమంలో మెహబూబా ముఫ్తీ జాతీయ జెండాతో పాటు జమ్ముకశ్మీర్ పాత రాష్ట్ర జెండాను కూడా చేతిలో పట్టుకున్నారు. అయితే జాతీయ జెండాలో పైభాగంలో ఉండాల్సిన కాషాయ రంగు కిందకు రావడం కనిపించింది. భారత జెండా నియమావళి ప్రకారం జాతీయ పతాకాన్ని నిర్ణీత విధానంలోనే ప్రదర్శించాలి. తలకిందులుగా ప్రదర్శించడం నిబంధనలకు విరుద్ధంగా పరిగణిస్తారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. మెహబూబా ముఫ్తీ ఉగ్రవాదులకు మద్దతుగా వ్యవహరించారని ఆరోపిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో దేశంలో "ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం" అమల్లోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎంపీ సత్‌పాల్ శర్మ కూడా ఆమె జాతీయ జెండాను అవమానించారని ఆరోపిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే మాత్రం ఘటనను ముందుగా పరిశీలించాలని అభిప్రాయపడ్డారు. ఉద్దేశపూర్వకంగా చేశారా, పొరపాటున జరిగిందా అనేది నిర్ధారించాల్సి ఉందన్నారు. జాతీయ జెండాను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ, గతంలో పీడీపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ ఇప్పుడు విమర్శించడం ఎందుకని ప్రశ్నించారు.

# బెదిరింపులకు భయపడం

**రాహుల్‌తో విద్యార్థి నిరసనకారులు.. మీరే రాజ్యాంగ సంరక్షకులు: రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ: ఇటీవల సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలతో వార్తల్లో నిలిచిన విద్యార్థులకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అండగా నిలిచారు. వారు "రాజ్యాంగ సంరక్షకులు" అని అభివర్ణించిన రాహుల్, తమ హక్కుల కోసం పోరాడుతున్న వారు ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులు, ముంబైలో పోలీస్ వ్యాన్‌ను అడ్డుకుని వైరల్ అయిన యువతితో కలిసి బుధవారం ఆయన తన నివాసం (10 జన్‌పథ్) వెలుపల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. "ఈ యువత, వీరిలాంటి వేలాది మంది భారతీయ యువకులు చేసిన దానికి నేను గర్వపడుతున్నాను. వారు రాజ్యాంగాన్ని, భారత దేశ స్ఫూర్తిని, దేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలిపోతున్న పనికిమాలిన వ్యవస్థకు వ్యతిరేకంగా గళం విప్పడం నేరం కాదు. వారు తమ ప్రజాస్వామ్య హక్కును మాత్రమే వినియోగించుకున్నారు" అని అన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో 15 ఏళ్ల బాలిక ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆ తర్వాత కేసు నమోదు కావడంతో ఆమె సోషల్ మీడియాలో క్షమాపణ చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ సహా పలు పార్టీలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. బాలికను భయపెట్టి, బలవంతంగా క్షమాపణ చెప్పించారని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందిస్తూ.. విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుపట్టారు. "విద్యార్థులు శాంతియుతంగా, ఎటువంటి దూకుడు లేకుండా నిరసన తెలిపారు. అయినా వారిని కొట్టారు, వేధించారు, బెదిరించారు. ఇప్పుడు వారి ఇళ్ల వద్దకు గూండాలను పంపి, క్షమాపణ చెప్పాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇది పూర్తిగా అర్థరహితమైన చర్య. మేము దీనిని అంగీకరించం" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి, విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మెరుగైన విద్యా వ్యవస్థ, పరీక్షా పత్రాల లీకేజీలకు ముగింపు, యువతకు సురక్షితమైన భవిష్యత్తు కావాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.



## హెచ్‌సీయూ సరికొత్త ఆవిష్కరణ

**'హైదరాసీన్'కు భారత పేటెంట్**




హైదరాబాద్, ఆగస్టు 5 (ఈవార్తలు): భారత రక్షణ, అంతరిక్ష రంగాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) కీలక ముందడుగు వేసింది. రాకెట్లు, క్షిపణులలో ఉపయోగించే ఘన ఇంధనం (సాలిడ్ రాకెట్ ప్రొపెల్లెంట్) కోసం 'హైదరాసీన్' అనే సరికొత్త పాలిమర్ ఆధారిత పదార్థాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసింది. ఈ ఆవిష్కరణకు భారత ప్రభుత్వం నుంచి పేటెంట్ కూడా లభించింది. ఇది దేశీయంగా రక్షణ, అంతరిక్ష సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించనుంది. హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన పరిశోధకుడు ముత్యాలనాయుడు గనివాడ, ప్రొఫెసర్ సౌరవ్ జానా, ప్రొఫెసర్ తుషార్ జానా బృందం ఈ నూతన పదార్థాన్ని అభివృద్ధి చేసింది. దశాబ్ద కాలంగా బర్న్-రేట్ కేటలిస్ట్‌లపై చేస్తున్న పరిశోధనల ఫలితంగా, సుమారు నాలుగేళ్ల కృషితో ఈ 'హైదరాసీన్' రూపుదిద్దుకుంది. ఈ ఆవిష్కరణకు గాను జూలై 21న భారత పేటెంట్ కార్యాలయం నుంచి పేటెంట్ (నం. 596319) మంజూరైంది. ప్రస్తుతం రాకెట్ ఇంధనం కోసం వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న 'బ్యూటాసీన్' అనే పదార్థాన్ని భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. దీనికి పూర్తిస్థాయి దేశీయ ప్రత్యామ్నాయంగా 'హైదరాసీన్'ను రూపొందించారు. సంప్రదాయ పద్ధతుల్లో ఇంధనాన్ని మండించడానికి బైండర్ (బంధకం), బర్న్-రేట్ కేటలిస్ట్ (దహన రేటును నియంత్రించే ఉత్ప్రేరకం) అనే రెండు వేర్వేరు పదార్థాలను వాడతారు. అయితే, 'హైదరాసీన్'లో ఈ రెండు లక్షణాలను ఒకే పాలిమర్ అణువులో మిళితం చేశారు. దీనివల్ల ఇంధనం మరింత స్థిరంగా, నియంత్రిత పద్ధతిలో, సమర్థవంతంగా మండుతుంది. దిగుమతి చేసుకునే బ్యూటాసీన్ ధర కిలోకు సుమారు రూ.50,000 నుంచి రూ60,000 వరకు ఉంటుంది. దీనితో పోలిస్తే 'హైదరాసీన్' చాలా తక్కువ ఖర్చుతో తయారవుతుందని, పనితీరులో సమానంగా లేదా అంతకంటే మెరుగ్గా ఉందని పరిశోధకులు తెలిపారు. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి ఊతమివ్వడమే కాకుండా, దేశ వ్యూహాత్మక అవసరాలకు కీలకమైన పదార్థాల దిగుమతి భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. నగరానికి గుర్తుగా ఈ ఆవిష్కరణకు 'హైదరాసీన్' అని పేరు పెట్టినట్లు ప్రొఫెసర్ తుషార్ జానా వివరించారు. తదుపరి దశలో ఈ టెక్నాలజీని డీఆర్‌డీఓ, ఇస్రో వంటి సంస్థలకు బదిలీ చేసి, వాణిజ్యపరంగా భారీ స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

## ఎయిరిండియా కొత్త సారథిగా టెవోల్డే




న్యూఢిల్లీ: భారీ నష్టాలతో సతమతమవుతూ, పలు సవాళ్లను ఎదుర్కొంటున్న టాటా గ్రూప్ సంస్థ ఎయిరిండియాలో కీలక మార్పు చోటుచేసుకుంది. సంస్థ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో), మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ మాజీ చీఫ్ టెవోల్డే గెబ్రెమరియమ్‌ను నియమిస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటన వెలువడింది. ప్రస్తుత సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో గెబ్రెమరియమ్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదం, పేరుకుపోతున్న నష్టాల నేపథ్యంలో ఈ మార్పు ప్రాధాన్యత సంతరించుకుంది. గెబ్రెమరియమ్ ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ సీఈవోగా దశాబ్దానికి పైగా పనిచేసి, ఆ సంస్థను ఆఫ్రికాలోనే అతిపెద్ద, అత్యంత లాభదాయకమైన విమానయాన సంస్థగా తీర్చిదిద్దారు. ఆయన నాయకత్వంలో ఆ సంస్థ ఆదాయం నాలుగు రెట్లు, విమానాల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. క్లిష్టమైన కార్యకలాపాల నిర్వహణ, అంతర్జాతీయ హబ్‌లను నిర్మించడం, నిర్వహణ-మరమ్మతుల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎయిరిండియా 2.8 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 23,000 కోట్లు) భారీ నష్టాన్ని నమోదు చేసింది. దీనికి తోడు పాకిస్థాన్ గగనతలం మూసివేత, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల కారణంగా పలు అంతర్జాతీయ విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ సవాళ్ల మధ్య సంస్థ పునరుద్ధరణ ప్రణాళికలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఎయిరిండియాను వృద్ధి, లాభదాయకత దిశగా నడిపించేందుకు గెబ్రెమరియమ్ సరైన వ్యక్తి అని బోర్డు ఏకగ్రీవంగా విశ్వసించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. టాటా సన్స్, ఎయిరిండియా చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ, "స్థిరీకరణ, విలీనం వంటి ప్రాథమిక దశలు పూర్తయ్యాయి. ఇప్పుడు ఎయిరిండియా వృద్ధి, విస్తరణ దశలోకి ప్రవేశిస్తోంది. గెబ్రెమరియమ్ అనుభవం సంస్థను ఒక ఉన్నతమైన గ్లోబల్ క్యారియర్‌గా నిలబెట్టడానికి దోహదపడుతుంది" అని అన్నారు. 2022లో టాటా గ్రూప్ ఎయిరిండియాను టేకోవర్ చేశాక సింగపూర్ ఎయిర్‌లైన్స్ మాజీ ఎగ్జిక్యూటివ్ అయిన క్యాంప్‌బెల్ విల్సన్‌ను సీఈవోగా నియమించింది. విలీన ప్రక్రియలను పర్యవేక్షించడం, భారీ విమానాల కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి ప్రాథమిక దశలో ఆయన అందించిన సేవలకు బోర్డు కృతజ్ఞతలు తెలిపింది.

## స్టాక్ మార్కెట్లకు స్వల్ప లాభాలు

న్యూఢిల్లీ: ఆర్బీఐ అంచనాలకు అనుగుణంగానే కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడంతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల నేపథ్యంలో రోజంతా సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయి. చివరికి, సెన్సెక్స్ 152.05 పాయింట్ల లాభంతో 78,581.00 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 9.75 పాయింట్ల స్వల్ప లాభంతో 24,624.65 వద్ద ముగిసింది. ఆర్బీఐ గవర్నర్ నేతృత్వంలోని మానిటరీ పాలసీ కమిటీ బెంచ్‌మార్క్ రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగించాలని నిర్ణయించింది. అలాగే, తమ తటస్థ వైఖరిని కూడా మార్చలేదు. మార్కెట్ వర్గాలు ఇదే ఆశించడంతో సూచీలపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించినప్పటికీ, ఇతర రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు నష్టపోకుండా గట్టెక్కాయి. సాంకేతికంగా, నిఫ్టీకి తక్షణ మద్దతు 24,500 వద్ద ఉందని, ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 24,400--24,300 జోన్ తదుపరి మద్దతుగా పనిచేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. డెరివేటివ్స్ డేటా ప్రకారం, 24,600 స్ట్రైక్ వద్ద అత్యధికంగా కాల్ ఓపెన్ ఇంట్రెస్ట్ ఉండటం వల్ల ఆ స్థాయిలో పదేపదే ప్రతిఘటన ఎదురవుతోందని, అదే సమయంలో 24,500, 24,400 స్ట్రైక్‌ల వద్ద బలమైన పుట్ ఓపెన్ ఇంట్రెస్ట్ సూచీకి మద్దతునిస్తోందని ఒక విశ్లేషకుడు తెలిపారు. నిఫ్టీలో కొత్త కొనుగోళ్ల ఉత్సాహం రావాలంటే 24,600 పైన స్థిరంగా ముగియాల్సి ఉంటుందని, అప్పటివరకు మార్కెట్ రేంజ్-బౌండ్‌లోనే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాను 6.7 శాతంగా ఆర్బీఐ కొనసాగించింది. మరోవైపు, ద్రవ్యోల్బణం అంచనాను 5.1 శాతం నుంచి 5 శాతానికి స్వల్పంగా తగ్గించడం సానుకూల అంశం. ఈరోజు ట్రేడింగ్‌లో శ్రీరామ్ ఫైనాన్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ఫ్రంట్‌లైన్ సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.18 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం మేర లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ మెటల్, రియల్టీ, ఆటో సూచీలు లాభపడగా, నిఫ్టీ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు నష్టాలతో ముగిశాయి.




## ఏఐతో భారత్‌కు లాభాలే ఎక్కువ: ప్రపంచ బ్యాంకు

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనల మధ్య ప్రపంచ బ్యాంకు ఆసక్తికర నివేదిక విడుదల చేసింది. భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏఐ ఉద్యోగాలను భర్తీ చేయడం కంటే, ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. సరైన చర్యలు తీసుకుంటే శతాబ్దం పట్టే అభివృద్ధిని పదేళ్లలోనే సాధించే అవకాశం ఉందని పేర్కొంది. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం.. అధిక ఆదాయ దేశాల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో 14.2 శాతం ఏఐ ఆటోమేషన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో మాత్రం ఈ ముప్పు 4.5 శాతమే. అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 16.2 శాతం ఉద్యోగాల్లో ఏఐ వల్ల ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సంఖ్య 18.7 శాతంగా ఉంది. భారీ ఏఐ మోడళ్లు, ఖరీదైన డేటా సెంటర్ల నిర్మాణం కంటే స్థానిక అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో పనిచేసే ఏఐ వ్యవస్థలను వినియోగిస్తే భారత్‌కు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ప్రపంచ బ్యాంకు సూచించింది. విద్య, వైద్యం, వ్యవసాయం, న్యాయ సేవలు, ప్రభుత్వ సేవల్లో ఏఐ కీలక మార్పులు తీసుకురాగలదని అభిప్రాయపడింది. ఇప్పటికే భారత్‌తో పాటు కెన్యా, మెక్సికో, నైజీరియా, థాయ్‌లాండ్‌లో ఐదుగురికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ఐదింటిలో ఒకటి ఏఐ చాట్‌బాట్‌లను వినియోగిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. అయితే విద్యుత్, ఇంటర్నెట్, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నాణ్యమైన డేటా, బలమైన వ్యవస్థలు లేకపోతే ఏఐ ప్రయోజనాలు పూర్తిగా అందవని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. దశలవారీగా ఏఐను అమలు చేయాలని, గోప్యతకు రక్షణ కల్పిస్తూ బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించింది.

## రూ.299 ప్లాన్‌కు ఎయిర్‌టెల్ గుడ్‌బై

న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్ తన అత్యంత చవక అన్‌లిమిటెడ్ ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ అయిన రూ.299 ప్యాక్‌ను నిలిపివేసింది. ఈ ప్లాన్‌ను కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ నుంచి కూడా తొలగించింది. దీంతో ఇకపై రూ.349 ప్లాన్ ఎయిర్‌టెల్‌లో అత్యంత తక్కువ ధరలో లభించే అన్‌లిమిటెడ్ ప్రీపెయిడ్ ప్లాన్‌గా మారింది. గతంలో రూ.299 ప్లాన్‌లో 28 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 1+దీ డేటా, అన్‌లిమిటెడ్ లోకల్, ఎస్‌టీడీ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, ఉచిత కాలర్ ట్యూన్స్, పర్‌ప్లెక్సిటీ ప్రో ఏఐ సబ్‌స్క్రిప్షన్ వంటి ప్రయోజనాలు ఉండేవి. ఇప్పుడు అందుబాటులో ఉన్న రూ.349 ప్లాన్‌లో 28 రోజుల వ్యాలిడిటీతో పాటు రోజుకు 2+దీ హైస్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. అదనంగా 6 నెలల యాపిల్ మ్యూజిక్ సబ్‌స్క్రిప్షన్, ఎయిర్‌టెల్ హలో ట్యూన్స్, 12 నెలల అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కూడా అందిస్తోంది. అలాగే రూ.399 ప్లాన్‌లో రోజుకు 2.5+దీ డేటాతో పాటు 28 రోజుల జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ కూడా లభిస్తోంది. ఎయిర్‌టెల్ రూ.579, రూ.619 ప్రీపెయిడ్ ప్లాన్‌లను కూడా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ సర్కిళ్లలో నిలిపివేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు ప్లాన్‌లు ప్రస్తుతం ఎయిర్‌టెల్ అధికారిక వెబ్‌సైట్‌లో ఇంకా కనిపిస్తున్నాయి. కాబట్టి వాటి నిలిపివేతపై కంపెనీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




## గడ్కరీపై డీప్‌ఫేక్ వీడియో తొలగించాలి

**బాంబే హైకోర్టు ఆదేశాలు**

ముంబై: ఇథనాల్ బ్లెండెడ్ ఇంధనం (ఈ20) వివాదంలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై బాంబే హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గడ్కరీకి వ్యతిరేకంగా ప్రచారంలో ఉన్న ఏఐ డీప్‌ఫేక్ వీడియోలు, నిందాపూర్వక పోస్టులను తక్షణమే తొలగించాలని మెటా, గూగుల్, ఎక్స్ వంటి దిగ్గజ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను న్యాయస్థానం ఆదేశించింది. ఈ కంటెంట్‌ను 'అత్యంత నీచమైనది, నిందాపూర్వకమైనది' అని అభివర్ణించిన ధర్మాసనం... ఇటువంటి పోస్టులకు బహిరంగ ప్లాట్‌ఫామ్‌లలో స్థానం ఉండకూడదని స్పష్టం చేసింది. ప్రతిసారీ బాధితులు కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా, ఇలాంటి పరువు నష్టం కలిగించే అభ్యంతరకర పోస్టులను స్వచ్ఛందంగా గుర్తించి తొలగించేలా ఏదైనా సాంకేతిక యంత్రాంగం ఉందా? అని సోషల్ మీడియా సంస్థలను నిలదీసింది. ఈ20 పెట్రోల్ విధానం ద్వారా తన కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందుతోందంటూ దొంగ సంతకాలు, ఫోర్జరీ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల తన పరువుకు తీవ్ర భంగం వాటిల్లిందని పేర్కొంటూ గడ్కరీ కోర్టును ఆశ్రయించారు. తన పరువుకు భంగం కలిగించినందుకు గాను రూ. 11 కోట్లను నష్టపరిహారంగా కోరారు. ఇథనాల్ ఇంధన విధానాన్ని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ మాత్రమే పర్యవేక్షిస్తుందని... దానితో తన మంత్రిత్వ శాఖకు గానీ, వ్యక్తిగతంగా తన కుటుంబానికి గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

వయ్యారి చిత్రం


అనుపమ అగ్నిహోత్రి

# డేటింగ్ అబద్ధం

**బాలీవుడ్ నటి ప్రీతి జింతా సహా ఇతర నటీమణులతో ఎఫైర్ సాగించాడంటూ సాగిన ప్రచారంపై ఇప్పుడు మాజీ ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ బ్రెట్ లీ క్లారిటీ ఇచ్చారు. ఈ ఊహాగానాలన్నీ పూర్తిగా నిరాధారమైనవని ఆయన తోసిపుచ్చారు. తాను ఏనాడూ ఏ బాలీవుడ్ నటితోనూ డేటింగ్ చేయలేదని లీ స్పష్టం చేశారు.**

**నిజం ఏంటో తనకు ఎల్లప్పుడూ తెలుసు కాబట్టి ఇలాంటి పుకార్లు తనను ఏనాడూ ప్రభావితం చేయలేదని తెలిపారు. ప్రీతి జింటా గురించి బ్రెట్ లీ మాట్లాడుతూ.. ఆమెను ఒక మంచి స్నేహితురాలని వర్ణించారు.**

ప్రీతి మేధస్సును, తెలివితేటలను ప్రశంసించడమే కాకుండా.. ఆమెపై తనకు ఎప్పటికీ అపారమైన గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆరంభంలో కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ జట్టుకు బ్రెట్ లీ ప్రాతినిధ్యం వహించగా... ఆ జట్టుకు ప్రీతి జింటా సహ యజమానిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ మ్యాచ్‌లలో వీరిద్దరూ కలిసి కనిపించడంతో వీరిద్దరి మధ్య ఏదో ఉందంటూ ఆ కాలంలో మీడియాలో, సోషల్ మీడియాలో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. మైదానంలో జట్టును ఉత్సాహపరిచే క్రమంలో వీరిద్దరి స్నేహబంధం అనేక రకాల రూమర్లకు దారితీసింది. అయితే ఆ సమయమంతా తాము కేవలం మైదానానికే పరిమితమైన ఒక వృత్తిపరమైన, చక్కని స్నేహబంధాన్ని మాత్రమే కొనసాగించామని లీ స్పష్టం చేశారు. ఇన్‌స్టాగ్రామ్ సహా ఇతర సోషల్ మీడియా లలో ఈ సమాచారం వైరల్ కావడంతో క్రీడాభిమానులు, సినీ ప్రేక్షకుల నుండి విపరీతమైన స్పందన లభించింది. చాలా కాలంగా నలుగుతున్న ఈ పుకార్లపై బ్రెట్ లీ స్వయంగా క్లారిటీ ఇవ్వడంతో అభిమానులు ఆయన వ్యాఖ్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు యూజర్లు వీరిద్దరి కాంబినేషన్ చూడటానికి చాలా బాగుండేదని వ్యాఖ్యానించగా... , మరికొందరు నిజం చెప్పినందుకు లీని అభినందించారు. క్రీడా ప్రపంచం, బాలీవుడ్ పరిశ్రమల మధ్య సంబంధాలు ఎల్లప్పుడూ మీడియా దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటాయి. చాలా సందర్భాల్లో ఇలాంటి అనుబంధాలు నిజమైన దాంపత్య బంధాలుగా మారినా.. కొన్నిసార్లు కేవలం స్నేహాన్ని కూడా పుకార్లుగా మార్చడం జరుగుతుంటుంది. బ్రెట్ లీ ఇచ్చిన ఈ వివరణతో ప్రీతి జింటాతో అతడికి ఉన్నది కేవలం గౌరవప్రదమైన స్నేహం మాత్రమేనని రుజువైంది. ముంబైలో పర్యటిస్తున్న బ్రెట్ లీ.. మీడియాతో మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు.






# జాతీయ అవార్డుల్లో పక్షపాతం: ఖుష్బూ

ధనుష్ నటించి దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రానికి జాతీయ చలనచిత్ర పురస్కారం దక్కడంపై సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. జాతీయ అవార్డుల ఎంపిక విధానం, జ్యూరీ పాటిస్తున్న ప్రమాణాలపై ఆమె పరోక్షంగా సందేహాలు వ్యక్తం చేశారు. పెద్ద సినిమాలకే గుర్తింపు ఇస్తూ, చిన్న ప్రాంతీయ చిత్రాలను.. ముఖ్యంగా ఒడియా వంటి పరిశ్రమల ప్రతిభను ఎందుకు విస్మరిస్తున్నారంటూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ధనుష్ ప్రధాన పాత్రలో వచ్చిన 'రాయన్' సినిమాకు ఉత్తమ తమిళ చిత్రంగా జాతీయ అవార్డు రావడంతో ఒకవైపు ప్రశంసలు అందుతుండగా, మరోవైపు విమర్శలు కూడా వస్తున్నాయి. ఇక ఈ క్రమంలో జాతీయ అవార్డులకు ఎంపిక చేసే విధానంపై ఖుష్బూ సుందర్ తన మనసులోని అనుమానాలను బయటపెట్టారు. అసలు ఒక సినిమాను ఉత్తమ చిత్రంగా ఎంపిక చేయడానికి జ్యూరీ ఎలాంటి ప్రమాణాలను కొలమానంగా తీసుకుంటుందో తనకు ఇప్పటికీ అర్థం కావడం లేదని స్పష్టం చేశారు.

# త్రిష్షపై ఉదయనిధి పాత పగ?




కొన్నాళ్ల క్రితం హిందూ మతంపై చేసిన వ్యాఖ్యలతో కొన్నాళ్లు వార్తల్లో నిలిచిన డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తాజా వివాదంతో మళ్లీ వార్తల్లో కెక్కారు. సినీ నటి త్రిషపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం మనకు తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో, గతంలో వీరిద్దరి కాంబినేషన్ గురించి వెలువడిన వార్తలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉదయనిధి సినిమాలో నటించేందుకు త్రిష నిరాకరించారని, రూ. 12 కోట్ల పారితోషికం ఆఫర్‌ను రిజెక్ట్ చేశారనే ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది. 2018లో దర్శకుడు కె.ఎస్. అధియమాన్ దర్శకత్వంలో 'ఏంజెల్' అనే టైటిల్‌తో ఒక సినిమా రాబోతుందని, అందులో త్రిష కథానాయికగా నటిస్తోందని వార్తలు రాగా, ఆ వార్తల్లో నిజం లేదని అప్పట్లోనే చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇక ఇటీవల ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణంలో నటించేందుకు త్రిషకు రూ. 12 కోట్లు ఆఫర్ చేశారనే వార్త నెట్టింట చక్కర్లు కొట్టినప్పటికీ, దీనిపై త్రిష లేదా రెడ్ జెయింట్ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మీడియా సైతం దీనిని కేవలం ఒక పుకారుగా లేదా నిర్ధారణ లేని అంశంగానే పేర్కొంది. నిజానికి రెడ్ జెయింట్ మూవీస్ నిర్మించిన 'కురువి', 'మన్మథన్ అంబు' వంటి చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించారు. ఉదయనిధి సంస్థతో ఆమెకు మంచి అనుబంధమే ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఉదయనిధి సరసన త్రిష ఒక్క సినిమాలోనూ నటించలేదు. ఫలితంగా, రూ. 12 కోట్ల ఆఫర్‌ను ఆమె తిరస్కరించారనే వార్త కేవలం ఆధారాలు లేని ప్రచారంగానే మిగిలిపోయింది.



# కీర్తి రూటే వేరు

కథానాయికల్లో వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న వారిలో కీర్తి సురేష్ ఒకరు. హిట్, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా విభిన్న కథలను ఎంచుకుంటూ వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతోంది. కమర్షియల్ సినిమాల్లో మాత్రమే కాకుండా లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ నటిస్తూ తనదైన ముద్ర వేస్తోంది. ఇప్పుడు కీర్తి సురేష్ నటించిన రెండు సినిమాలు ఒకే రోజున విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న 'డొరాతి' చిత్రానికి కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. మరోవైపు నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంలో కీర్తి సురేష్ స్పెషల్ సాంగ్‌లో కనిపించనుంది. ఈ సినిమాను కూడా సెప్టెంబర్ 25నే విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో కీర్తి సురేష్ ఒకే రోజున రెండు సినిమాలతో ప్రేక్షకులను పలకరించనున్నట్లు తెలుస్తోంది.



# బాలీవుడ్ ఖాన్స్.. బిష్ణోయ్ టార్గెట్

బాలీవుడ్ అగ్ర నటులైన 'ఖాన్'ల త్రయానికి వరుస బెదిరింపులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ మరియు ఆయన కుటుంబం గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి ప్రాణహాని బెదిరింపులను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దశాబ్దాల నాటి కృష్ణజింకల వేట కేసు లారెన్స్ బిష్ణోయ్ రూపంలో ఆయనను నేటికీ వెంటాడుతుండటంతో, ఎల్లప్పుడూ బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో, భారీ పోలీసు రక్షణ నడుమ నిరంతర టెన్షన్ వాతావరణంలో కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో షారూఖ్ ఖాన్‌కు కూడా ఇలాంటి బెదిరింపులు ఎదురుకావడంతో బాలీవుడ్ స్టార్స్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాజాగా అమీర్ ఖాన్‌కు కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తీవ్ర హెచ్చరికలు రావడంతో ఆయన భద్రతను అధికారులు మరింత కట్టుదిట్టం చేశారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఆర్జూ బిష్ణోయ్, టైసన్ బిష్ణోయ్ లతో ముడిపడి ఉన్న ఒక సోషల్ మీడియా పోస్ట్ ఇటీవల వైరల్‌గా మారింది.






# టార్చర్ చేయకండి.. ప్లీజ్: రేణు దేశాయ్

టాలీవుడ్ సీనియర్ నటి, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాజీ భార్య రేణు దేశాయ్ సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. విడాకుల తర్వాత కొద్ది కాలంపాటు వెండితెరకు దూరంగా ఉన్నప్పటికీ, తన సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే రేణు దేశాయ్, తనను పవన్ అభిమానులు ఇప్పటికీ వదిన అని పిలవడంపై గతంలోనే పలుమార్లు అసహనం వ్యక్తం చేశారు. అలాగే తన పిల్లలకు సంబంధించిన విషయాలను కూడా తరచుగా నెటిజన్లతో పంచుకుంటారు. ఈ క్రమంలో తాజాగా ఓ పవన్ కళ్యాణ్ అభిమాని ఇన్స్టాగ్రామ్‌లో కామెంట్ చేస్తూ.. "వదిన గారు మీరు కొన్ని సంవత్సరాలు ఓపిక పట్టుంటే బాగుండేది. ఒక దేవుడిని వివాహం చేసుకుని ఆయన గురించి పూర్తిగా తెలుసుకోకుండా వెళ్లిపోయారు.

# రణబాలి వాయిదా.. కన్ఫర్మ్

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన జంటగా నటిస్తున్న మూవీ 'రణబాలి'. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ నటిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనున్నారు. అజయ్ అతుల్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే.. పెళ్లి అయిన తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక కలిసి నటిస్తున్న మొదటి చిత్రం కావడంతో




ఈ మూవీ కోసం ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు సైతం ఎంతో ఈగర్‌గా ఎదురుచూస్తున్నారు. కానీ ఈ మూవీ విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. స్టార్టింగ్‌లో సెప్టెంబర్ 11న సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించినప్పటికీ, షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో వాయిదా పడే అవకాశాలు ఎక్కువ కనిపిస్తున్నట్లు ఫిలిమ్ వర్గాల నుంచి గట్టిగానే వార్తలు వినిపించాయి. ఎట్టకేలకు రణబాలి వాయిదాపై క్లారిటీ వచ్చింది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్'. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



## విన్నర్లకు ఇండియా
# ఘన స్వాగతం

కామన్వెల్త్ క్రీడల్లో దేశానికి పతకాల పంట పండించి ఢిల్లీకి చేరుకున్న భారత క్రీడాకారులకు ఢిల్లీలో ఘనస్వాగతం లభించింది. ఏడు పసిడి పతకాలు గెలిచిన బాక్సర్లతో పాటు జూడోలో భారత్‌కు చరిత్రాత్మక స్వర్ణాన్ని అందించిన అస్మితకు ఎయిర్‌పోర్ట్‌లో వందలాది అభిమానులు స్వాగతం పలికారు. మెడలో పూలమాలలతో పాటు రూ. 50 నోట్లతో తయారుచేసిన దండ వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అస్మిత స్పందిస్తూ.. 'జూడోలో దేశానికి గోల్డ్ మెడల్ అందించాలనేది నా కల. గ్లాస్గోకు వెళ్లినప్పుడూ అదే నా మనసులో ఉండేది. భారత్‌కు వెళ్తే స్వర్ణంతోనే వెళ్లాలి అనుకునేదాన్ని' అని తెలిపింది.




## పాక్ క్రికెటర్ ఆమిర్‌కు
# ఇంగ్లండ్ పౌరసత్వం



పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ అధికారికంగా ఇంగ్లండ్ పౌరసత్వం (యుకే పౌరసత్వం) పొందడంతో ఆయన ఐపీఎల్ లో ఆడటంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. బ్రిటిష్ పాస్‌పోర్ట్ రావడంతో ఆమిర్ ఇప్పుడు ఇంగ్లండ్ దేశవాళీ క్రికెట్‌తో పాటు 'ది హండ్రెడ్' టోర్నీలో ట్రెంట్ రాకెట్స్ తరఫున లోకల్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతున్నాడు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పాక్ ఆటగాళ్లపై ఐపీఎల్‌లో నిషేధం ఉన్నప్పటికీ... గతంలో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ బ్రిటిష్ పౌరసత్వం పొంది కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే నిబంధనల ప్రకారం మహమ్మద్ ఆమిర్‌కు కూడా ఇంగ్లండ్ ప్లేయర్‌గా ఐపీఎల్ వేలంలో పాల్గొనే అర్హత లభించింది. ఈ సందర్భంగా ఆమిర్ స్పందిస్తూ... "2027 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో నేను విదేశీ ప్లేయర్ గా ఆడతాను. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే... నేను అందులో పాల్గొంటానో లేదో ఇప్పటికైతే నాకూ తెలియదు, ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ఐపీఎల్ పాల్గొనడంపై ఎలాంటి ప్రణాళికలు ఖరారు చేయలేదని, ముందుగా ప్రస్తుతం ఆడుతున్న లీగ్‌లపైనే శ్రద్ధ పెట్టినట్లు తెలిపాడు.

# పాక్ బాక్సర్ కుద్రతుల్లా అదృశ్యం



స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో ఇటీవలే ముగిసిన కామన్వెల్త్ గేమ్స్-2026 వేదికగా ఒక షాకింగ్ పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్‌కు చెందిన స్టార్ బాక్సర్ కుద్రతుల్లా గేమ్స్ విలేజ్ నుంచి అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. టోర్నీ ముగిసి పాకిస్థాన్ జట్టులోని ఇతర అథ్లెట్లు, అధికారులు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో ఈ విషయం వెలుగులోకి రావడం పాకిస్థాన్ బాక్సింగ్ ఫెడరేషన్ (పీబీఎఫ్)కు తీవ్ర అవమానకరమైన పరిస్థితిగా మారింది. కుద్రతుల్లా 57 కేజీల ఫెదర్‌వెయిట్ విభాగంలో పాకిస్థాన్ తరఫున కామన్వెల్త్ గేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించాడు. అయితే క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి పాలైన తర్వాత, ఆగస్టు 2న గేమ్స్ ముగిసి జట్టు తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్న సమయంలో ఆయన ఎవరికీ చెప్పకుండా గ్లాస్గోలోని తన గది నుంచి కనిపించకుండా పోయాడు. జట్టు మేనేజర్, అధికారులు ఆయన గదిని పరిశీలించగా.. తన పాస్‌పోర్ట్, ప్రయాణ పత్రాలు, ఇతర విలువైన సామగ్రితో పాటు ఆయన పరారైనట్లు నిర్ధారణ అయింది. కేవలం మాతృదేశానికి వెళ్లే ఎయిర్ టికెట్లను మాత్రమే గదిలోని టేబుల్‌పై వదిలేసి వెళ్లాడని పాక్ క్రీడా వర్గాలు వెల్లడించాయి.



# వీవీఎస్‌కే బీసీసీఐ ఎస్!?

**భారత క్రికెట్‌లో మరో కీలక మార్పుకు రంగం సిద్ధమవుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. జట్టు ఎంపిక బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ భవితవ్యంపై సందిగ్ధత నెలకొంది. ఆయన స్థానంలో భారత మాజీ స్టార్ వీవీఎస్ లక్ష్మణ్‌ను తీసుకురావాలని బీసీసీఐ పెద్దలు ఆలోచిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.**

రోహిత్ శర్మ భవిష్యత్తు చుట్టూ జరిగిన పరిణామాలు కూడా ఈ చర్చకు బలం చేకూర్చినట్టు తెలుస్తోంది. బీసీసీఐ ప్రధాన ఎంపిక కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ ఒప్పందం జూన్ 2026తో ముగిసింది. ఆ తర్వాత బోర్డు మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆయన కొనసాగుతారనే ప్రచారం జరుగుతూ వచ్చింది. కానీ, ఇప్పుడు అనూహ్యంగా కొత్త ముఖాన్ని తీసుకురావాలనే ఆలోచన సాగుతున్నట్టు సమాచారం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ పది మ్యాచ్‌ల్లో ఎనిమిది ఓటములు చవిచూసింది. ఈ ప్రదర్శనపై సమీక్ష సమావేశం నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సమావేశం జరగాల్సి ఉన్నా ఇప్పటికీ నిర్వహించలేదు. ఇప్పటికే భారత జట్టు శ్రీలంక పర్యటనకు వెళ్లిపోయింది. దీంతో ఆ సమావేశం ఎప్పుడు జరుగుతుందనే ఆసక్తి నెలకొంది.

# లంక జట్టు ఓనర్‌గా జహీర్



భారత జట్టు మాజీ పేసర్ జహీర్ ఖాన్ కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించాడు. మైదానంలో బౌలర్‌గా రాణించిన జహీర్, ఇప్పుడు వ్యాపారవేత్తగా మారి ఫ్రాంచైజీ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. శ్రీలంకలో జరిగే లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్)లో అత్యంత విజయవంతమైన జట్టుగా పేరుగాంచిన జాఫ్నా కింగ్స్‌కు సహ యజమానిగాజహీర్ ఖాన్ బాధ్యతలు స్వీకరించాడు. స్వీడన్ కేంద్రంగా పనిచేసే 'యాంకర్ స్పోర్ట్స్ ఏబీ' అనే గ్లోబల్ స్పోర్ట్స్ గ్రూప్, జాఫ్నా ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. ఈ సంస్థ అధినేత నాగేంద్ర సిద్ధొటమ్‌తో కలిసి జహీర్ ఖాన్ భాగస్వామి అయ్యాడు. దీంతో ఫ్రాంచైజీ పేరును 'యాంకర్ జాఫ్నా కింగ్స్'గా మార్చారు. ఈ సంస్థకు ఇప్పటికే యూరోపియన్ టీ20, కెనడా సూపర్ 60 లీగ్స్‌లో కూడా జట్లు ఉన్నాయి. గతంలో జాఫ్నా కింగ్స్ యాజమాన్యంపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు రావడమే ఈ మార్పుకు ప్రధాన కారణం. పాత యాజమాన్య బృందంలోని సహ యజమాని మంజోత్ కల్రాను ఈ కేసులో అరెస్ట్ చేయడంతో శ్రీలంక క్రికెట్ బోర్డు ఆ ఒప్పందాన్ని రద్దు చేసింది. దీంతో యాంకర్ స్పోర్ట్స్ సంస్థ కొత్త యాజమాన్య హక్కులను దక్కించుకుంది. ఈ కొత్త బాధ్యతపై జహీర్ ఖాన్ ఆనందం వ్యక్తం చేశాడు. "శ్రీలంక క్రికెట్‌లో ఎంతో ప్రతిభ ఉంది. అక్కడి బౌలింగ్ నైపుణ్యాలంటే నాకు ఎంతో గౌరవం. ఇప్పుడు యజమానిగా ఆ దేశ క్రికెట్‌లో భాగం కావడం ఉత్సాహంగా ఉంది" అని ఆయన అన్నాడు. జహీర్ వంటి దిగ్గజం రాకతో లంక యువ క్రికెటర్లకు గొప్ప మార్గనిర్దేశం లభిస్తుందని ఎల్‌పీఎల్ టోర్నమెంట్ డైరెక్టర్ సమంత దొడన్‌వేల హర్షం వ్యక్తం చేశారు. ఎల్‌పీఎల్ చరిత్రలో జాఫ్నా కింగ్స్ జట్టు ఇప్పటివరకు 5 సీజన్లలో 4 సార్లు ఛాంపియన్‌గా నిలిచి రికార్డు సృష్టించింది.



# ఇషాన్ కిషన్‌కు బ్యాంకు ఉద్యోగం!

స్పోర్ట్స్ కోటాలో ఇషాన్ కిషన్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం లభించింది. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌కు బ్రేక్ రావడంతో ఇషాన్ కిషన్ విధుల్లో చేరాడు. పట్నాలోని ఆర్బీఐ రీజనల్ ఆఫీస్‌లో విధులు నిర్వహించాడు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది ఇషాన్ కిషన్‌తో ఫొటోలు దిగారు. అవి నెట్టింట వైరల్ అయ్యాయి. ఆటతో పాటు ఉద్యోగ బాధ్యతలూ నిర్వర్తించడంపై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఆర్బీఐ అసిస్టెంట్ మేనేజర్‌గా ఇషాన్ కిషన్‌కు సుమారు రూ. 1.22 లక్షల నుంచి రూ. 1.24 లక్షల వరకు జీతం రానుంది. పీఎఫ్, ఇతర కంటింగ్స్ పోను అతనికి నెలకు రూ. 1.08 లక్షల నుంచి 1.12 లక్షల జీతం వచ్చే అవకాశం ఉంది. దేశవాళీ క్రికెట్‌లో అద్వితీయమైన ప్రదర్శనతో అనూహ్యంగా భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన ఇషాన్ కిషన్.. నిలకడైన ఆటతీరుతో జట్టు తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ప్రణాళికల్లోనే లేని ఇషాన్ కిషన్ చివరి నిమిషంలో జట్టులోకి వచ్చాడు. మెగా టోర్నీలో సత్తా చాటి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత ఐపీఎల్‌లోనూ అదే జోరు కొనసాగించాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో తడబడినా.. ఇతర బ్యాటర్ల కంటే మెరుగైన పరుగులే చేశాడు. జింబాబ్వే పర్యటనలో మళ్లీ తన ఫామ్ నిరూపించుకున్నాడు. ప్రస్తుతం భారత్ టెస్ట్ సిరీస్ ఆడనుండటంతో ఇషాన్ కిషన్‌కు సుదీర్ఘ విరామం లభించింది. టీమిండియా తదుపరి టీ20 సిరీస్ అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో ఆడనుంది. ఈ సిరీస్‌తోనే ఇషాన్ కిషన్ మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్నాడు. అయితే ఈ బ్రేక్‌లో దేశవాళీ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్‌ను ఇషాన్ కిషన్ నడిపించనున్నాడు. ఆగస్ట్ 23 నుంచి దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్ తలపడనుంది.



## నా ఫేవరేట్ కోచ్
# రవిశాస్త్రి: షమీ

టీమిండియా పేసర్ మహమ్మద్ షమీ తన ఫేవరేట్ కోచ్ ఎవరో చెప్పారు. తాను గౌతమ్ గంభీర్ పర్యవేక్షణలో ఎక్కువగా ఆడలేదని, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, రవి శాస్త్రిల హయాంలో మంచి క్రికెట్ ఆడానని తెలిపాడు. ఈ నలుగురిలో ఒకరిని ఎంపిక చేసుకోమంటే మాత్రం రవిశాస్త్రి ఎంచుకుంటానని చెప్పాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత మహమ్మద్ షమీ భారత్ తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఫిట్‌నెస్ సాధించి దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటినా సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో యువ బౌలర్లకే ప్రాధాన్యత ఇస్తామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. పరోక్షంగా షమీ, భువనేశ్వర్ కుమార్ వంటి సీనియర్ పేసర్లు రిటైర్ అవ్వడమే ఉత్తమమని తెలియజేశాడు.



అయితే 2027 వన్డే ప్రపంచకప్‌కు మహమ్మద్ షమీని తీసుకోవాలని, సౌతాఫ్రికా వంటి కండిషన్స్‌లో అతని అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న షమీని ఫేవరేట్ కోచ్ ఎవరు? అని ప్రశ్నించగా.. రవి శాస్త్రి పేరు చెప్పాడు. 'ఎవరు గొప్ప కోచ్ అనే పోల్చడం కాస్త కష్టమే. గౌతీ భాయ్ హయాంలో నేను ఎక్కువగా ఆడలేదు. నేను ఎక్కువగా రాహుల్ భాయ్, అనిల్ భాయ్, రవిశాస్త్రి హయాంలో మంచి క్రికెట్ ఆడాను. ఈ నలుగురిలో ఒకర్ని ఎంచుకోమంటే మాత్రం రవి భాయ్‌ను ఎంపిక చేసుకుంటాను. ఎందుకంటే ఆటగాళ్లకు అతను పూర్తి స్వేచ్ఛ ఇస్తాడు'అని చెప్పుకొచ్చాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# సేవా రాజకీయాలు మళ్లీ వస్తాయా?

రాజకీయాలు అంటే ఒకప్పుడు ప్రజాసేవకు ప్రతీకగా భావించేవారు. ప్రజల కష్టాలను తెలుసుకోవడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం, సమాజ అభివృద్ధికి కృషి చేయడం నాయకత్వానికి ప్రధాన లక్షణాలుగా ఉండేవి. అయితే కాలక్రమేణా రాజకీయాల స్వరూపం మారిపోయింది. సేవా దృక్పథం కంటే అధికారం, ఎన్నికల గెలుపు, ప్రచారం, పరస్పర విమర్శలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సేవా రాజకీయాలు మళ్లీ వస్తాయా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. నేడు ప్రజల ఆశలు కూడా మారాయి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీల కంటే, అధికారంలోకి వచ్చిన తర్వాత కనిపించే పనితీరును వారు ఎక్కువగా గమనిస్తున్నారు. రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక అవసరాలను తీర్చగల నాయకత్వానికే ప్రజలు ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో రాజకీయ ప్రచారం విస్తరించినా, ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొచ్చే నాయకులకే శాశ్వత గుర్తింపు లభిస్తుంది. సేవా రాజకీయాలు తిరిగి రావాలంటే కేవలం రాజకీయ పార్టీలే కాదు, ప్రజల ఆలోచనా విధానంలోనూ మార్పు అవసరం. కులం, మతం, డబ్బు, తాత్కాలిక ప్రయోజనాల కంటే నిజాయితీ, పారదర్శకత, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే నాయకులను ఎన్నుకునే సంస్కృతి పెరగాలి. అలాగే రాజకీయ నాయకులు కూడా ఎన్నికలకే పరిమితం కాకుండా, ప్రజల మధ్య నిరంతరం ఉంటూ వారి సమస్యలకు బాధ్యతగా స్పందించాలి. ప్రజాస్వామ్యం బలపడేది ప్రచారంతో కాదు, ప్రజాసేవతో. సేవా రాజకీయాలు మళ్లీ రావడం అసాధ్యం కాదు. ప్రజలు బాధ్యతాయుతంగా ఓటు వేస్తే, నాయకులు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేలా పనిచేస్తే, రాజకీయాల్లో విలువలు తిరిగి పునరుద్ధరించబడతాయి. అధికారం శాశ్వతం కాదు, కానీ ప్రజల కోసం చేసిన సేవ మాత్రం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.



# "ఏఐ యుగం.."

## సంప్రదాయ వృత్తులు మాయం!

ప్రపంచం మరో పారిశ్రామిక విప్లవాన్ని చూస్తోంది. ఒకప్పుడు ఆవిరి యంత్రం ఉత్పత్తి విధానాన్ని మార్చింది. ఆ తర్వాత విద్యుత్, కంప్యూటర్లు, ఇంటర్నెట్ మానవ జీవితాన్ని పూర్తిగా రూపాంతరం చేశాయి. ఇప్పుడు కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ రంగం, విద్య, వైద్యం, వ్యవసాయం, మీడియా, కళలు, సృజనాత్మక రంగాలు ఇలా ప్రతి రంగంలోనూ తన ముద్ర వేస్తోంది. మనిషి గంటల తరబడి చేసే పనిని కొన్ని క్షణాల్లో పూర్తి చేసే స్థాయికి ఏఐ చేరుకుంది. ఈ మార్పు అభివృద్ధికి సంకేతమే అయినప్పటికీ, మరోవైపు శతాబ్దాలుగా సమాజానికి ఆధారంగా నిలిచిన అనేక సంప్రదాయ వృత్తులను అంచెలంచెలుగా కనుమరుగయ్యే పరిస్థితికి నెట్టేస్తోంది. ఒకప్పుడు ప్రతి గ్రామంలో కుమ్మరి చక్రం తిరిగేది. కమ్మరి కొలిమి మండేది. వడ్రంగి చేతిలో చెక్కకు జీవం వచ్చేది. నేయుగాడి మగ్గం శబ్దం వినిపించేది. స్వర్ణకారుడు ఆభరణాలను చేతితో తీర్చిదిద్దేవాడు. తోలుబొమ్మల కళాకారులు, బొమ్మల తయారీదారులు, చేనేత కార్మికులు, బుట్టల అల్లికలో నిపుణులు, చేతితో చిత్రాలు గీసే కళాకారులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉండేవారు. కానీ నేడు వారి స్థానాన్ని యంత్రాలు, భారీ ఉత్పత్తి కేంద్రాలు, డిజిటల్ నమూనాలు, ఆటోమేటెడ్ తయారీ వ్యవస్థలు ఆక్రమిస్తున్నాయి. ఇప్పుడు ఈ మార్పును మరింత వేగవంతం చేస్తున్నది కృత్రిమ మేధస్సు. ఏఐ ప్రభావం కేవలం సమాచార సాంకేతిక రంగానికే పరిమితం కాలేదు. నేడు ఒక డిజైనర్ గంటల తరబడి తయారు చేసే నమూనాను ఏఐ కొన్ని సెకన్లలో రూపొందిస్తోంది. ప్రకటనలు, పోస్టర్లు, లోగోలు, చిత్రాలు, వీడియోలు, అనువాదాలు, వార్తల ముసాయిదాలు, సంగీతం, స్వర రూపకల్పన.. ఇలా అన్నింటిలోనూ ఏఐ ప్రవేశించింది. దీనివల్ల సంప్రదాయ డిజైనర్లు, చిత్రకారులు, టైపిస్టులు, చిన్న ముద్రణాలయాలు, స్టూడియోలు, ఫోటో ఎడిటింగ్ కేంద్రాలు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు ఒక పనికి ఐదుగురు అవసరమైతే, ఇప్పుడు అదే పనిని ఒక వ్యక్తి ఏఐ సహాయంతో పూర్తి చేయగలుగుతున్నాడు. సంప్రదాయ వృత్తుల సంక్షోభానికి ఏఐ ఒక్కటే కారణం కాదు. యాంత్రీకరణ, ప్రపంచీకరణ, చౌక దిగుమతులు, వినియోగదారుల అభిరుచుల మార్పు, మార్కెట్ పోటీ, యువతలో ఆసక్తి తగ్గడం, తక్కువ ఆదాయం, ముడిసరుకు ధరల పెరుగుదల.. ఇవన్నీ కలిసి ఈ వృత్తులను బలహీనపరిచాయి. అయితే ఈ మార్పును అత్యంత వేగంగా ముందుకు నడిపిస్తున్నది ఏఐ ఆధారిత సాంకేతికత.

తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట చేనేతలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందినా, వాటి వెనుక ఉన్న కుటుంబాలు మాత్రం తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. చేతితో తయారయ్యే వస్తువులకు ఎక్కువ సమయం, అధిక ఖర్చు అవసరం. అదే సమయంలో యంత్రాల ద్వారా తక్కువ ధరకు, వేగంగా ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తున్నాయి. వినియోగదారుడు ధరను మాత్రమే చూస్తే, కళాకారుడి శ్రమకు విలువ తగ్గిపోతుంది. ఇదే పరిస్థితి కుమ్మరులు, కమ్మర్లు, వడ్రంగులు, బుట్టల అల్లిక చేసే కుటుంబాలు, తోలుబొమ్మల కళాకారులు, జానపద కళాకారులకూ వర్తిస్తుంది. ఒకప్పుడు గ్రామీణ జీవనంలో అంతర్భాగంగా ఉన్న వారి సేవలకు ఇప్పుడు డిమాండ్ తగ్గుతోంది. ఆధునిక ఉత్పత్తులు, ప్లాస్టిక్ వస్తువులు, ఫ్యాక్టరీ తయారీ వస్తువులు వారి మార్కెట్‌ను కుదించాయి. ఇప్పుడు డిజిటల్ మార్కెట్, ఏఐ ఆధారిత ఉత్పత్తి వ్యవస్థలు ఈ పోటీని మరింత తీవ్రం చేస్తున్నాయి. అయితే ఈ మార్పును కేవలం ముప్పుగా మాత్రమే చూడటం కూడా సరైంది కాదు. చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే.. సాంకేతిక విప్లవాలు కొన్ని వృత్తులను తగ్గించినప్పటికీ, కొత్త అవకాశాలను కూడా సృష్టిస్తాయి. ఒకప్పుడు కంప్యూటర్లు వస్తే ఉద్యోగాలు పోతాయని భావించారు. కానీ కంప్యూటర్ రంగం లక్షలాది కొత్త ఉద్యోగాలకు మార్గం వేసింది. అలాగే ఏఐ కూడా కొన్ని పనులను భర్తీ చేస్తూనే, కొత్త నైపుణ్యాలకు భారీ డిమాండ్‌ను సృష్టిస్తోంది. సవాలు ఏఐ కాదు. సవాలు మార్పుకు అనుగుణంగా మనం సిద్ధం కాకపోవడమే. సంప్రదాయ కళాకారులు తమ ఉత్పత్తులను డిజిటల్ వేదికలపై విక్రయించడం, ప్రపంచ మార్కెట్‌ను చేరుకోవడం, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కొత్త నమూనాలను రూపొందించడం, ఏఐని సహాయక సాధనంగా ఉపయోగించడం నేర్చుకుంటే వారి అవకాశాలు విస్తరిస్తాయి. చేతివృత్తికి యంత్రం ప్రత్యామ్నాయం కాలేదు; కానీ మార్కెట్ చేరుకోవడానికి సాంకేతికత ఒక శక్తివంతమైన వేదిక అవుతుంది. ప్రభుత్వాల పాత్ర ఇక్కడ అత్యంత కీలకం. సంప్రదాయ వృత్తులను కేవలం సంక్షేమ పథకాలతో నిలబెట్టలేరు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ, డిజిటల్ నైపుణ్యాలు, ఈ-కామర్స్ అనుసంధానం, బ్రాండింగ్, ఎగుమతి అవకాశాలు, వడ్డీ రహిత రుణాలు, ఆధునిక పరికరాలు, ఉత్పత్తి రూపకల్పనలో సహకారం, జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులకు ప్రత్యేక ప్రోత్సాహం వంటి చర్యలు అవసరం. పాఠశాలలు, కళాశాలల్లో సంప్రదాయ కళలు, చేతివృత్తులపై అవగాహన పెంపొందించాలి. యువతకు ఈ రంగాల్లో ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించాలి.

ప్రైవేట్ రంగం, సాంకేతిక సంస్థలు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలి. ఏఐ సాధనాలను రూపొందించే సంస్థలు సంప్రదాయ కళాకారులకు ప్రత్యేక శిక్షణ, మార్కెటింగ్ సహాయం, డిజిటల్ డిజైన్ పరికరాల వినియోగంపై శిక్షణ అందించగలవు. పెద్ద ఈ-కామర్స్ సంస్థలు స్థానిక కళాకారుల ఉత్పత్తులకు ప్రత్యేక వేదికలు కల్పించాలి. సమాజం పాత్రను కూడా విస్మరించలేం. చౌక వస్తువు కొనడం మాత్రమే అభివృద్ధి కాదు. స్థానిక కళాకారుడి శ్రమను గౌరవించడం, చేతితో తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయడం, భారతీయ చేతివృత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా వేలాది కుటుంబాలకు జీవనాధారాన్ని అందించవచ్చు. ప్రతి పండుగలో, ప్రతి శుభకార్యంలో, ప్రతి ఇంట్లో కనీసం కొన్ని స్థానిక కళాకారుల ఉత్పత్తులకు స్థానం కల్పించడం కూడా ఒక సామాజిక బాధ్యతే. భవిష్యత్తు ప్రపంచం ఏఐ ఆధారంగానే ముందుకు సాగుతుంది. దాన్ని ఎవరూ ఆపలేరు. కానీ అభివృద్ధి అంటే పాతదాన్ని చెరిపేయడం కాదు; విలువైనదాన్ని కాపాడుకుంటూ కొత్తదాన్ని ఆహ్వానించడం. యంత్రాలు వేగాన్ని ఇవ్వగలవు. కానీ చేతివృత్తులు మన సంస్కృతిని, సృజనాత్మకతను, మానవ స్పర్శను నిలబెడతాయి. ఒక చేతితో సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే, మరో చేతితో సంప్రదాయాలను కాపాడగలిగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఏఐ మనిషికి ప్రత్యర్థి కాదు; అతని సహచరంగా మారాలి. యంత్రాలు ఆలోచించగలవేమో గానీ, మనిషి హృదయాన్ని, సంస్కృతిని, కళాత్మకతను, తరతరాలుగా సంక్రమించిన నైపుణ్యాన్ని భర్తీ చేయలేవు. సంప్రదాయ వృత్తులను మ్యూజియంలలో మాత్రమే చూసే పరిస్థితి రాకముందే ప్రభుత్వాలు, పరిశ్రమలు, సమాజం, వినియోగదారులు కలిసి చర్యలు తీసుకోవాలి. లేకపోతే రేపటి తరానికి మిగిలేది కేవలం వాటి చిత్రాలే తప్ప, వాటిని సృష్టించిన చేతులు కాదు. ఏఐ యుగంలో అసలైన విజయం యంత్రాల వేగంలో లేదు. మనిషి నైపుణ్యాన్ని, సంస్కృతిని, చేతివృత్తులను కొత్త ప్రపంచానికి అనుసంధానం చేయడంలో ఉంది. అదే జరిగితే అభివృద్ధి సమగ్రంగా ఉంటుంది. లేకపోతే సాంకేతికంగా ముందుకెళ్లినా, నాగరికంగా వెనక్కి వెళ్లినట్లే అవుతుంది.





చుక్కల శ్రీకాంత్

నిజామాబాద్


# చేనేతకు కొత్త ఊపిరి ఎప్పుడు?

"చేనేత అనేది కేవలం ఒక వృత్తి కాదు... అది భారతీయ సంస్కృతికి అద్దం పట్టే కళ." ఒకప్పుడు ప్రతి ఇంట్లో మగ్గం శబ్దం వినిపించేది. ప్రతి పండుగకు, ప్రతి శుభకార్యానికి చేనేత వస్త్రానికే తొలి ప్రాధాన్యం ఉండేది. కానీ నేడు అదే చేనేత పరిశ్రమ మనుగడ కోసం పోరాడుతోంది. తరతరాలుగా మగ్గాన్ని నమ్ముకున్న కుటుంబాలు వృత్తిని వదిలి వలసబాట పడుతున్నాయి. యువత చేనేతను ఉపాధిగా ఎంచుకోవడానికి వెనుకంజ వేస్తోంది. ప్రశ్న ఒక్కటే.. చేనేతకు కొత్త ఊపిరి ఎప్పుడు?



తెలంగాణలోని సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట, ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ, ధర్మవరం వంటి ప్రాంతాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన చేనేత కేంద్రాలు. ఈ ప్రాంతాల నేతన్నల చేతుల్లో అద్భుతమైన నైపుణ్యం ఉంది. కానీ ఆ నైపుణ్యానికి తగిన ఆదాయం లేదు. ఒక చీరను నేయడానికి రోజులు, కొన్నిసార్లు వారాలు పట్టినా, దానికి వచ్చే పారితోషికం మాత్రం కుటుంబాన్ని గడపడానికి సరిపోని పరిస్థితి ఉంది. చేనేత సంక్షోభానికి ప్రధాన కారణం మార్కెట్‌లో అసమాన పోటీ. యంత్రాలపై భారీ స్థాయిలో తయారయ్యే వస్త్రాలు తక్కువ ధరకు అందుబాటులోకి వస్తున్నాయి. వినియోగదారుడు ధరను చూసి కొనుగోలు చేస్తాడు. కానీ చేనేత వెనుక ఉన్న శ్రమ, కళ, సమయం, నాణ్యతకు సరైన విలువ చెల్లించే వ్యవస్థ బలహీనంగా ఉంది. మరోవైపు ముడి సరుకుల ధరలు నిరంతరం పెరుగుతున్నాయి. పత్తి, పట్టు, రంగులు, విద్యుత్, రవాణా ఖర్చులు పెరిగినా నేత కార్మికుడి ఆదాయం అంతగా పెరగలేదు. మధ్యవర్తులపై ఆధారపడటం వల్ల అసలు లాభం చాలాసార్లు తయారీదారుడికి కాకుండా మార్కెట్ వ్యవస్థలోని ఇతరులకు వెళ్తోంది. ప్రభుత్వాలు చేనేత సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నాయి. రాయితీలు, మార్కెటింగ్ సహాయం, సహకార సంఘాలు, ఆన్‌లైన్ విక్రయాలు, పండుగల సందర్భంగా చేనేత ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇవి ఉపయోగకరమైన చర్యలే. అయితే ఒక వాస్తవాన్ని అంగీకరించాల్సిందే. ఇప్పటికీ అనేక మంది నేతన్నల ఆదాయం స్థిరంగా లేదు. పథకాల కంటే స్థిరమైన మార్కెట్, న్యాయమైన ధర, నిరంతర ఉపాధి వారికి మరింత అవసరం. చేనేతకు పెద్ద సమస్య తరాల మార్పు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూసిన యువత మగ్గం దగ్గరకు రావడం లేదు. తక్కువ ఆదాయం, అనిశ్చిత భవిష్యత్తు కారణంగా వారు ఇతర రంగాల్లో ఉపాధి వెతుకుతున్నారు. దీంతో శతాబ్దాలుగా వస్తున్న నైపుణ్యం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

ఈ పరిస్థితిని మార్చాలంటే చేనేతను సంప్రదాయ పరిశ్రమగా మాత్రమే కాకుండా సృజనాత్మక ఆర్థిక రంగంగా చూడాలి. ప్రపంచ ఫ్యాషన్ మార్కెట్‌లో చేతితో నేసిన వస్త్రాలకు మంచి డిమాండ్ ఉంది. సహజ రంగులు, పర్యావరణ హిత ఉత్పత్తులు, నాణ్యమైన డిజైన్లు అంతర్జాతీయ వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఈ అవకాశాలను భారత చేనేత పూర్తిగా వినియోగించుకోవాలి. డిజైన్‌లో కొత్తదనం అవసరం. సంప్రదాయ నమూనాలతో పాటు ఆధునిక యువత అభిరుచులకు తగ్గ దుస్తులు, కార్యాలయ దుస్తులు, గృహ అలంకరణ ఉత్పత్తులు, ఫ్యాషన్ ఉపకరణాలు తయారు చేయాలి. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు, డిజైన్ సంస్థలు, చేనేత క్లస్టర్లు కలిసి పనిచేసే వ్యవస్థను బలోపేతం చేయాలి. డిజిటల్ మార్కెట్ కూడా చేనేతకు గొప్ప అవకాశం. ఒక చిన్న గ్రామంలోని నేత కార్మికుడు ప్రపంచ వినియోగదారునికి నేరుగా తన ఉత్పత్తిని విక్రయించే పరిస్థితి రావాలి. ఈ-కామర్స్, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ బ్రాండింగ్, జియోగ్రాఫికల్ ఇండికేషన్ గుర్తింపులను మరింత సమర్థంగా వినియోగించాలి. ప్రభుత్వ కొనుగోళ్లలో చేనేతకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా కీలకం. పాఠశాల యూనిఫారాలు, ప్రభుత్వ ఉద్యోగుల దుస్తులు, అధికారిక కానుకలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో చేనేత వినియోగాన్ని పెంచితే లక్షల మీటర్ల వస్త్రానికి స్థిరమైన మార్కెట్ ఏర్పడుతుంది.

సహకార సంఘాలను ఆధునీకరించాలి. ముడి సరుకుల సమీకరణ, సాధారణ రంగుల యూనిట్లు, డిజైన్ కేంద్రాలు, నాణ్యత పరీక్షా కేంద్రాలు, డిజిటల్ విక్రయ వేదికలు అందుబాటులోకి రావాలి. బ్యాంకు రుణాలు సులభతరం కావాలి. సామాజిక భద్రత, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి అంశాల్లో నేత కార్మికులకు మరింత రక్షణ అవసరం. వినియోగదారుల బాధ్యత కూడా తక్కువ కాదు. పండుగలు, వివాహాలు, ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం ఒక కుటుంబానికి ఉపాధి కల్పించడమే. చేనేత వస్త్రం కొనడం అంటే కేవలం బట్ట కొనడం కాదు; ఒక కళను, ఒక కుటుంబాన్ని, ఒక సంప్రదాయాన్ని నిలబెట్టడం. చేనేతను కాపాడటం అంటే గతాన్ని మాత్రమే కాపాడటం కాదు... భవిష్యత్తును కూడా నిర్మించడం. మగ్గం శబ్దం ఆగిపోతే అది ఒక వృత్తి ముగింపు మాత్రమే కాదు, మన సంస్కృతిలోని ఒక అధ్యాయం ముగిసినట్లే. నేతన్న చేతిలోని కళకు మార్కెట్, గౌరవం, ఆదాయం కల్పించగలిగితేనే చేనేతకు నిజమైన కొత్త ఊపిరి లభిస్తుంది. ప్రభుత్వ విధానాలు, మార్కెట్ సంస్కరణలు, వినియోగదారుల చైతన్యం.. ఈ మూడు కలిసి నడిచినప్పుడే భారత చేనేత మళ్లీ ప్రపంచాన్ని ఆకట్టుకునే స్వర్ణయుగాన్ని అందుకుంటుంది.




బొమ్మకంటి గంగాధర్

ఈవార్తలు దినపత్రిక చైర్మన్


## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.